సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 175

పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | సోమవారం 22 జూన్ 2026

Published from Hyderabad, Vijayawada.

## దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ రీ ఎగ్జామ్

### హైదరాబాద్ సహా 24 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

### నిమిషం ఆలస్యం.. 'నీట్'గా నో చెప్పిన అధికారులు

### పరీక్షకు 20 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరు



దేశవ్యాప్తంగా నీట్ యూజీ రీ ఎగ్జామ్ ప్రశాంతంగా ముగిసింది. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6.20 వరకు పరీక్ష రాసేందుకు అనుమతి ఉంది. ఈ పరీక్ష కోసం దేశవ్యాప్తంగా 551, విదేశాల్లోని 14 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీస్ శాఖలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. పలు చోట్ల విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. మన దేశంలోని 5,440

మిగతా 2 లో..



## భారత రక్షణ రంగంలో చారిత్రాత్మక ఘట్టం

### నౌకాదళంలోకి 3 అత్యాధునిక యుద్ధనౌకలు..

భారత రక్షణ రంగంలో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆత్మనిర్భర్ భారత్ సంకల్పంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో తయారైన మూడు అత్యాధునిక యుద్ధనౌకలు ఒకేసారి భారత నౌకాదళంలోకి అడుగుపెట్టాయి. ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవ సందర్భంగా కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఘనంగా

మిగతా 2 లో..



## రైల్వే ప్రయాణికులకు భారీ షాక్

### టికెట్ లేని ప్రయాణానికి భారీగా ఫైన్లు

రైల్వే ప్రయాణికుల భద్రత, క్రమశిక్షణను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 1989 రైల్వే చట్టాన్ని జన విశ్వాస్ పేరిట సవరించింది. ఈ మారిన చట్టాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రైల్వే రక్షక దళం ఇకపై అక్కడికక్కడే భారీ జరిమానాలు

మిగతా 2 లో..



## మా అంతర్గత విషయాల్లో జోక్యం ఎందుకు?

### ఆ హక్కు పాకిస్థాన్‌కు ఏ మాత్రం లేదు


### భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆగ్రహం

అంతర్గత విషయాల్లో భారత్‌పై నోరుపారేసుకోవడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిపోయింది. ఇటీవల యూఎన్‌లో జమ్ముకశ్మీర్, మైనార్టీల భద్రత, సింధు జలాల ఒప్పందం అంశాల్లో భారత్‌ను టార్గెట్ చేసి ఇండియా ప్రతినిధి నుంచి మొట్టికాయలు తిన్న పాకిస్థాన్ మరోసారి

మిగతా 2 లో..

# ముగిసిన తొలి విడత చర్చలు..

- కాల్పుల విరమణపై ప్రత్యేక సెల్ ఏర్పాటు
- వాణిజ్య నౌకలకు నష్టం వాటిల్లకూడదని సూచన
- 60 రోజుల్లో పూర్తి చేయడానికి రోడ్‌మ్యాప్
- మిడిల్ ఈస్ట్ సంక్షోభ నివారణకు చర్యలు
- 60 రోజుల రోడ్‌మ్యాప్ పై కీలక చర్చలు
- కాల్పుల విరమణ అమలుపై కార్యాచరణ
- సద్దుమనిగేందుకు రంగంలోకి అగ్రనేతలు
- హోర్ముజ్ జలసంధి' వివాదం నీలినీడలు!



అమెరికాన్ – ఇరాన్ మధ్య తొలి విడత చర్చలు ముగిశాయి. శాంతి ఒప్పందంపై సంతకాలు పూర్తయిన తర్వాత ఇరు దేశాలు ఇప్పుడు స్విట్జర్లాండ్ వేదికగా చర్చలు చేస్తున్నాయి. తొలి విడత చర్చల్లో లెబనాన్‌లో కాల్పుల విరమణ అంశంపై ప్రస్తావించారు. దీని కోసం ఓ ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా హార్మూజ్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని నిర్ణయించారు. కీలకమైన అణు ఒప్పందంపై సుదీర్ఘ చర్చలు సాగే అవకాశం ఉంది.స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో అమెరికా – ఇరాన్ మధ్య తొలి విడత ఉన్నత స్థాయి చర్చలు ముగిశాయి. వంద రోజులకు పైగా సాగిన భీకర యుద్ధం తర్వాత శాంతి ఒప్పందం కుదరడం, ఆ వెంటనే చర్చలు జరుగుతుండటం ఇరు దేశాలతో పాటు ప్రపంచ దేశాలకు కొంత సానుకూలమైన వాతావరణం అని చెప్పొచ్చు. పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ చర్చలను పర్యవేక్షించేందుకు ఓ హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చర్చల ప్రక్రియను రాజకీయ స్థాయిలో పర్యవేస్తుంది. అదేవిధంగా అణు కార్యక్రమం, ఆంక్షలు, పర్యవేక్షణ వ్యవస్థలు, వివాద పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక వర్కింగ్ గ్రూపులు పనిచేస్తాయి. అంతిమ ఒప్పందాన్ని 60 రోజుల్లో పూర్తి చేయడానికి రోడ్‌మ్యాప్‌కు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. చర్చల సమయంలో ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా హార్మూజ్ జలసంధి భద్రతకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని

మిగతా 2 లో..

## 'హర్ముజ్ జలసంధి'పై అమెరికా టారిఫ్స్!

### 60 రోజుల్లో ఒప్పందం కుదరకపోతే విధిస్తాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

ఇరాన్‌తో 60 రోజుల్లోగా తుది శాంతి ఒప్పందం కుదరని పక్షంలో, వ్యూహాత్మక 'హర్ముజ్ జలసంధి' గుండా వెళ్లే నౌకలపై వాషింగ్టన్ సొంతంగా సముద్రపు సుంకాలను విధిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. టెహ్రాన్‌తో కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందం ప్రకారం.. కీలకమైన ఈ ఇంధన రవాణా కారిడార్ గుండా కేవలం రెండు నెలల పాటు మాత్రమే ఉచిత రవాణాకు స్పష్టమైన హామీ ఉంది.

మిగతా 2 లో..

## మెట్రో రెండో దశ నిధుల కోసం

# ప్రయత్నాలు

- జూన్ 23 వరకూ ఢిల్లీలో సీఎం రేవంత్
- ప్రాజెక్టు త్వరిత అనుమతుల కోసం ప్రయత్నం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలిసే అవకాశం
- పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే చాన్స్!



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉన్నారు. జూన్ 23 వరకూ అక్కడే పర్యటిస్తారు. ఈ టూర్‌లో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 విస్తరణ, ఫేజ్–1 టేకోవర్, ఇడియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లోన్ విడుదల వంటి కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, రేవంత్ రెడ్డి జూన్ 20న లేఖ రాసి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఇది జూన్ 16న రాసిన మొదటి లేఖకు అనుసంధానంగా ఉంది.

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 ప్రాజెక్ట్ 122.9 కిలోమీటర్ల పొడవుతో 7 కారిడార్లను కలిగి ఉంటుంది. దీని అంచనా వ్యయం రూ.38,595 కోట్లు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కేంద్రంతో 50:50 భాగస్వామ్యంలో చేపట్టాలని ఆశిస్తోంది. కేంద్రం సహకరించకపోతే 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' ద్వారా తామే 100 శాతం ఈక్విటీతో పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో డీపీఆర్ సమర్పించిన ఈ ప్రాజెక్టు త్వరిత అనుమతుల కోసం ఇప్పుడు ఢిల్లీ చర్చలు కీలకంగా మారాయి.

ఫేజ్–1 టేకోవర్ విషయంలో కూడా పెండింగ్ సమస్యలు ఉన్నాయి. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి రూ.15,000 కోట్ల



# దేశవ్యాప్తంగా మిన్నంటిన యోగా సంబరాలు..

### వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ

### ఉత్సాహంతో యోగాసనాలు వేసిన ప్రధాని

### ఆసనాలతో అదరగొట్టిన కేంద్ర మంత్రులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా యోగా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో దేశంలోని పలు ప్రాంతాలలో కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, బాలీవుడ్ ప్రముఖులు సామాన్య ప్రజలతో కలిసి యోగాసనాలు వేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంత అవసరమో వీరంతా చాటిచెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సాగుతున్న యోగా ఉద్యమంలో భాగంగా ఆయన ఒక ప్రత్యేక వేదికపై సామూహిక యోగా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను చేకూర్చే యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన

మిగతా 3 లో..



## 9 మార్గాల్లో వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్..

### ఆగస్ట్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోన్న రైల్వేశాఖ

### ఢిల్లీ-సికింద్రాబాద్ మధ్య తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్..



దేశంలో ఇప్పటికే తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తుండగా.. మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే స్లీపర్ రైల్వే సెట్ల తయారీ

మిగతా 3 లో..

## కేటీఆర్‌తో హైకోర్టు న్యాయవాదుల సంఘం భేటీ

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో హైకోర్టు న్యాయవాదుల సంఘం భేటీ అయ్యింది. హైకోర్టు జడ్జీల నియామకాల్లో స్థానిక న్యాయవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానం చేశారు. సామాజిక న్యాయం పాటిస్తూ, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని వినతినిచ్చారు. జూన్ 15న అత్యవసర తీర్మానం, జూన్ 17న నిరసన తెలిపామని ప్రతినిధులు వివరించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి చేసింది. న్యాయవాదుల పోరాటానికి పూర్తి మద్దతును కేటీఆర్ ప్రకటించారు.

## మధ్య ప్రదేశ్ నుంచే రాజకీయాలు చేస్తా

- బీజేపీ, ఎన్నికల సంఘం లాలూచీ పడ్డాయి
- నాపై పై ఎలాంటి లీగల్ కేసులు లేవు
- అఫిడవిట్ సాకుతో కుట్ర పూరితంగా చర్య
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి



మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన నామినేషన్‌ను బీజేపీ, ఎన్నికల సంఘం లాలూచీపడి తిరస్కరించాయని, తన సీటును దొంగిలించారని ఆమె ఆరోపించారు. తనపై ఎలాంటి లీగల్ కేసులు లేవని.. అఫిడవిట్ సాకుతో కుట్ర పూరితంగా వ్యవహరించారని మండిపడ్డారు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తినని.. కాబట్టి అక్కడి నుంచే

మిగతా 3 లో..

## గాంధీ పేరుతో రేవంత్‌రెడ్డి

# మూసీ విధ్వంసం

- మీ వల్ల మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుంది
- ప్రజల ఇండ్లను కూల్చేందుకు సిఎం కుట్ర
- సిఎం రేవంత్‌రెడ్డి అనే సినిమా అట్టర్ ఫ్లాప్
- సినిమాతో 4కోట్ల తెలంగాణ ప్రజలకు నష్టం
- బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ



మహాత్ముడి పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న మూసీ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కమీషన్లు, కాసుల కోసం వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చేందుకు రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రను స్వయంగా మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని, అయినా వినకుండా పేదలపై సీఎం తన ప్రతాపం చూపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను అయినా మహాత్మా గాంధీ విగ్రహం పెడుతానని దొంగ మాటలు చెప్తున్నారని మండిపడ్డారు. గాంధీపై నిజంగా రేవంత్‌కు ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చకుండా మహాత్ముడి విగ్రహం పెట్టాలని సూచించారు. 'చివరికి పిల్లలు సైతం తమ ఇండ్లు కూలగొట్టవద్దు.. కిడ్డీ బ్యాంక్ డబ్బులైనా ఇస్తాం.. మమ్మల్ని వదిలిపెట్టండి' అని వేడుకున్నా మనసు కరగని

మిగతా 3 లో..

# సంపాదకీయం

## కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థ అవసరం

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

## భారత రక్షణ రంగంలో చారిత్రాత్మక ఘట్టం

మొదటిపేజీ తరువాయి..

జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బెంగాల్ గడ్డపై ప్రశంసల జల్లు కురిపించారు. భారతదేశ ఆలోచనలకు కొత్త దిశానిర్దేశం చేసి, దేశ పునరుజ్జీవనానికి ఊతమిచ్చిన గొప్ప భూమి బెంగాల్ అని కొనియాడారు. శతాబ్దాలుగా సముద్ర మార్గం ద్వారా భారతదేశాన్ని ప్రపంచంతో అనుసంధానించడంలో ఈ ప్రాంతం కీలక పాత్ర పోషించిందన్నారు. స్వయంసమృద్ధ, సురక్షితమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ఇదొక మైలురాయని ఆయన అన్నారు. జూన్ 21న ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం రోజే, దేశంలోనే అత్యంత అధునాతన హైడ్రోగ్రఫీ నౌక ఐఎన్ఎస్ సంశోధక్ ను నౌకాదళంలోకి ప్రవేశపెట్టడం ఒక అద్భుతమైన కాకతాళీయమని మోదీ చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో దేశ భద్రత, అభివృద్ధి , శ్రేయస్సు పూర్తిగా సముద్రంతోనే ముడిపడి ఉంటాయని.. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యం మొత్తం ఎక్కువగా సముద్ర మార్గానే జరుగుతుందన్నారు. డిజిటల్‌గా ప్రపంచాన్ని కలిపే డేటా నెట్‌వర్క్ అంతా సముద్రం అడుగు భాగం నుంచే వెళ్తోందన్నారు. రాబోయే రోజుల్లో కీలకమైన ఖనిజాలు, సరికొత్త ఇంధన వనరుల అన్వేషణకు సముద్రాలే కేంద్ర బిందువు కాబోతున్నాయన్నారు.



# ముగిసిన తొలి విడత చర్చలు..

మొదటిపేజీ తరువాయి..

నిర్ణయించారు. దీని ప్రధాన లక్ష్యం హోర్మూజ్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడం. అదేవిధంగా సముద్ర మార్గంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా చూడటం. తొలి విడత చర్చల్లో ప్రధానంగా లెవనెత్తిన అంశం లెబనాన్‌లో కాల్పుల విరమణ. లెబనాన్‌లో సైనిక చర్యల విరమణను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సెల్‌లో చర్చల్లో పాల్గొంటున్న ఇరుపక్షాలు, లెబనాన్ ప్రభుత్వం కూడా భాగస్వాములుగా ఉండనున్నాయి. దీనికి ఖతార్, పాకిస్థాన్ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తాయి. అమెరికా - ఇరాన్ మొదటి విడత సమావేశాలు ముగిసినప్పటికీ చర్చలు ఇంకా కొనసాగనున్నాయి. ముఖ్యంగా అణు ఒప్పందం, ఆంక్షలు, భద్రతా అంశాలపై సాంకేతిక స్థాయి చర్చలు ఈ వారం మొత్తం బర్గెన్‌స్టాక్‌లో కొనసాగనున్నాయి. ఈ మేరకు ఇరు దేశాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఈ చర్చల ప్రధాన ఉద్దేశం మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడమే.

ఈ చర్చల్లో ఇజ్రాయెల్ కానీ, హిజ్బుల్లా కానీ లేదా లెబనాన్ ప్రభుత్వం కానీ నేరుగా భాగస్వాములు కానప్పటికీ, అమెరికా తన వ్యూహాన్ని మార్చి ఈ అంశాన్ని చర్చల అజెండాలో చేర్చింది. లెబనాన్ సరిహద్దుల్లో కొనసాగుతున్న దాడుల నేపథ్యంలో ఈ అంశాన్ని చర్చించడానికి ఇరుపక్షాల చర్చల ప్రతినిధులు అంగీకరించినట్లు తెలుస్తుంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్ నేతృత్వంలోని ఈ బృందంలో విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో పాటు సెంట్రల్ బ్యాంక్, చమురు శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నృత్వంలోని ఈ బృందంలో సీనియర్ ప్రతినిధులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ ఉన్నారు. స్విట్జర్లాండ్ బయలుదేరే ముందు వాన్స్ మాట్లాడుతూ.. ఇరాన్, పాకిస్తాన్, ఖతార్ ప్రతినిధులతో అణు సమస్య, లెబనాన్ కాల్పుల విరమణపై పురోగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ కూడా ఈ సాంకేతిక స్థాయి చర్చల్లో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ చేరుకున్నారు. మరోవైపు, అంతర్జాతీయంగా అత్యంత వ్యూహాత్మకమైన హోర్మూజ్ జలసంధి ( పై నెలకొన్న తీఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయమై స్పందిస్తూ.. రాబోయే 60 రోజుల్లోగా తుది ఒప్పందం కుదరకపోతే, సముద్ర రవాణా మార్గమైన హోర్మూజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై అమెరికా టోల్ ట్యాక్స్ ( విధిస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. దీనికి ప్రతిగా ఇరాన్ స్పందిస్తూ, జలసంధిలో పరిస్థితులు అనేవి కాల్పుల విరమణ కట్టుబాట్లను అమలు చేయడంపైనే ఆధారపడి ఉంటాయని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి హోర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో లేదని, వాణిజ్య నౌకల రాకపోకలు యథాతథంగా సాగుతున్నాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది.ద్ర వివాదం ఈ చర్చలపై ప్రభావం చూపుతోంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించడమేనని, అందుకే తాము హోర్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించామని ఇరాన్




ప్రకటించింది. అయితే అమెరికా ఈ వాదనను పూర్తిగా తోసిపుచ్చింది. ఈ చర్చల ప్రారంభానికి ముందు ఇరాన్ స్పీకర్ గాలిబాఫ్ ' స్పందిస్తూ, గతంలో జరిగిన 'మినాబ్ పాఠశాల ఘటన' బాధితులను స్మరించుకున్నారు. మినాబ్ అమాయక పిల్లలు, ఇరాన్ అమరవీరులు ప్రతి క్షణం తన ప్రతి చర్యను గమనిస్తూనే ఉంటారని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 'హర్మూజ్ జలసంధి'పై అమెరికా టారిఫ్స్!

మొదటిపేజీ తరువాయి..

ఈ నేపథ్యంలోనే స్వదేశంలో వస్తున్న రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ట్రంప్ ఈ కఠిన నిర్ణయాన్ని ప్రకటించారు.

తాత్కాలిక సంధి కాలం ముగిసిన తర్వాత ఇరాన్ రవాణా రుసుములను వసూలు చేయడానికి అనుమతిస్తారా లేదా అనే దానిపై ప్రాంతీయంగా మరియు స్వదేశంలో పెరుగుతున్న ఆందోళనలను



తగ్గించడానికి అధ్యక్షుడు ట్రంప్ క్యాంప్ డేవిడ్ నుండి సోషల్ మీడియా ద్వారా కీలక ప్రకటన చేశారు. ఈ 60 రోజుల వ్యవధిలో లేదా ఆ తర్వాత కూడా అమెరికా నేరుగా వసూలు చేస్తే తప్ప, ఎటువంటి సముద్రపు రుసుములను అనుమతించేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమ ఆసియాలోని దేశాలకు అమెరికా సైన్యం ఒక "గార్డియన్ ఏంజిల్" (రక్షక దేవుడు) లాగా వ్యవహరిస్తోందని, అందువల్ల తాము విధించే ఫీజులు గత మరియు భవిష్యత్తు కార్యాచరణ ఖర్చులను రికవరీ చేయడానికి, సైన్యం అందించిన సేవలకు చట్టబద్ధమైన ప్రతిఫలమని ఆయన అభివర్ణించారు. ఈ ఊహించని టారిఫ్ హెచ్చరికలు స్విట్జర్లాండ్‌లో సాంకేతిక స్థాయి చర్చలు ప్రారంభమవుతున్న అత్యంత సున్నితమైన సమయంలో వచ్చాయి. సమగ్ర అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి మరియు విస్తృత ప్రాంతీయ వివాదాన్ని పరిష్కరించడానికి జరుగుతున్న ఈ హై-స్టేక్స్ స్విస్ చర్చలలో పాకిస్తాన్, ఖతార్ దేశాలు కీలక మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. ఈ దౌత్యపరమైన పురోగతిని కాపాడటానికి అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి వాన్స్ మరియు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాగెర్ ఖలీబాఫ్‌లతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు ఐరోపాకు చేరుకుంటున్నాయి. అయితే, ఈ తాత్కాలిక ఏర్పాట్ల మనుగడ ఇప్పటికే తీవ్ర నిశిత పరిశీలనను ఎదుర్కొంటోంది. లెబనాన్‌పై ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడులను ప్రస్తావిస్తూ, వాషింగ్టన్ తన భౌగోళిక రాజకీయ కట్టుబాట్లను స్పష్టంగా ఉల్లంఘించిందని ఇరాన్ అత్యున్నత సంయుక్త సైనిక కమాండ్ ఆరోపించింది. అంతేకాకుండా, హోర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఇరాన్ తొలుత ప్రకటించింది. అన్ని రంగాలలో తక్షణమే శత్రుత్వాలను నిలిపివేయాలని ప్రాథమిక ఒప్పందం కోరుతోందని టెహ్రాన్ వాదిస్తోంది. టెహ్రాన్ నుండి వస్తున్న తీవ్రమైన ప్రకటనలను వాషింగ్టన్ పూర్తిగా తిరస్కరించింది. అంతర్జాతీయ షిప్పింగ్ లేన్‌పై ఇరాన్‌కు ఎలాంటి సార్వభౌమాధికారం లేదని కొట్టిపారేసింది. పాశ్చాత్య నౌకాదళాల కఠిన నిఘా నీడలో సముద్ర రవాణా సజావుగా సాగుతుందని యుఎస్ సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. వివాదం రేగిన వెంటనే మిలియన్ల కొద్దీ చమురు బారెళ్లను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లే డజన్ల కొద్దీ వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని పేర్కొంది.

# దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ రీ ఎగ్జామ్

మొదటిపేజీ తరువాయి..

కేంద్రాలతో పాటు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. హిందీ, ఇంగ్లీష్‌తోపాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్ష జరిగిందని ఎన్‌టీఏ పేర్కొంది. దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి వల్లే ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించగలిగామని ఎన్‌టీఏ తెలిపింది. ఈ పరీక్షలో 10వేల మందికిపైగా దివ్యాంగులైన అభ్యర్థుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశామంది. అలాగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న సుమారు 81 మంది అభ్యర్థుల కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేసినట్లు వెల్లడించింది. వీరిలో రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్న ఒక విద్యార్థి, అలాగే కీమోథెరపీ చికిత్స పొందుతున్న మరొక విద్యార్థి కూడా పరీక్షకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొంది. పరీక్షను పారదర్శకతను పెంచేందుకు, భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్, ముఖ గుర్తింపు విధానాన్ని ఉపయోగించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీ మానిటరింగ్, సిగ్నల్ జామర్లు, రాష్ట్ర పోలీసుల సహకారంతో రెండు అంచెల తనిఖీలను అమలు చేశారు. సీసీటీవీ విజువల్స్‌ను నిరంతరం పర్యవేక్షించేందుకు ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం, విద్యామంత్రిత్వశాఖ, ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 34 కేంద్ర విద్యా సంస్థలు, అలాగే అన్ని రాష్ట్రాలు, జిల్లా కలెక్టరేట్లలో 'కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు' ఏర్పాటు చేశారు. నీట్ పేపర్ లీక్ తర్వాత రీ-ఎగ్జామ్‌ను కేవలం 37 రోజుల వ్యవధిలోనే ప్లాన్ చేసి నిర్వహించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా పోలీసులు, అబ్జర్వర్లు, పరీక్ష సిబ్బందితో కలిపి దాదాపు 7 లక్షల మంది అధికారులను రంగంలోకి దించినట్లు ఏజెన్సీ వెల్లడించింది. దాదాపు 20 లక్షలకు పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొంది. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరగ్గా దివ్యాంగులకు సాయంత్రం 6.20గంటల వరకు పరీక్ష నిర్వహించామని తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ సహా 24 జిల్లాల్లో ఏర్పాటు చేసిన నీట్ కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీంచారు. బర్కత్‌పురా కేంద్రానికి ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. బాగ్‌లింగంపల్లి కేంద్రానికి బదులు శేర్ లింగంపల్లికి వెళ్లి వచ్చిన కొడంగల్‌కు చెందిన విద్యార్థిని ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో లోనికి పంపలేదు. సోమాజిగూడలోని రాజభవన్ ప్రభుత్వ హైస్కూల్ కేంద్రానికి కేవలం ఒక నిమిషం ఆలస్యంగా చేరుకున్న ముగ్గురు విద్యార్థులను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ఉస్మానియా యూనివర్సిటీలోని నీట్ పరీక్ష కేంద్రంలో ఎగ్జామ్ సెంటర్ తెలవక ఓ విద్యార్థిని, ఆమె తండ్రి గందరగోళానికి గురయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ గౌడ్ వారిని గమనించారు. ఆలస్యం చేయకుండా వారి వద్దకు వెళ్లారు. వారి సమస్యను అడిగారు. విద్యార్థిని తన ఎగ్జామ్ సెంటర్ తెలవక ఇబ్బంది పడుతున్నానని ఇన్స్పెక్టర్‌కు తెలియజేసింది. తక్షణమే విద్యార్థిని, ఆమె తండ్రి తన కారులో ఎక్కించుకొని పరీక్షా కేంద్రానికి సమయానికి తీసుకెళ్లారు. మహేష్ కుమార్ గౌడ్ చేసిన సహాయానికి విద్యార్థిని, ఆమె తండ్రి ధన్యవాదాలు తెలిపారు. ఎల్బీ నగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కూకట్‌పల్లి జేఎన్టీయూలో పోలీసుల ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల మధ్య



పరీక్షలు జరిగాయి. సికింద్రాబాద్‌లోని కీస్ పాఠశాలలో నీట్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చారు. దీంతో ఇద్దరు విద్యార్థులను పరీక్ష కేంద్రంలో ఉన్న అధికారులు వెనక్కి పంపారు. పరీక్షా సమయానికి సకాలంలో రాకపోవడంతో అధికారులు వెనక్కి పంపగా ఓ విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. పరీక్ష మొదలైనప్పటికీ అనుమతిస్తారనే ఆశతో కొంత మంది విద్యార్థులు అక్కడే ఎదురుచూస్తున్నారు. బాగ్‌లింగంపల్లిలో నీట్ పరీక్ష కేంద్రానికి విద్యార్థిని ఆలస్యంగా వచ్చింది. బాగ్‌లింగంపల్లి బదులు తొలుత శేరిలింగంపల్లి వెళ్లిన విద్యార్థిని ఝాన్సీప్రియ పొరపాటు గ్రహించి బాగ్‌లింగంపల్లి వచ్చేలోపు గడువు ముగిసింది. నీట్ పరీక్ష రాసేందుకు కొడంగల్ నుంచి వచ్చింది. కోఠిలోని నీట్ పరీక్ష కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. అటు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను అధికారులు లోనికి పంపలేదు

## మా అంతర్గత విషయాల్లో జోక్యం ఎందుకు?

మొదటిపేజీ తరువాయి..

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసింది. అయితే, భారత విదేశాంగ శాఖ అదే స్థాయిలో సమాధానమిచ్చింది. ఇండియా అంతర్గత వ్యవహారాలపై పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటనను విడుదల చేశారు. భారత్ సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాలపై పాక్ అనవసరంగా జోక్యం చేసుకుంటే సహించేది లేదని తేల్చి రణధీర్ జైస్వాల్ చెప్పారు. పాకిస్థాన్ అధ్యక్షుడు చేసిన సత్యదూరమైన భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందన్నారు. భారత అంతర్గత వ్యవహారాలపై మాట్లాడానికి ఆయనకు ఎలాంటి హక్కు లేదన్నారు. దేశంలో ముస్లిం మతపరమైన స్థలాలకు, చారిత్రక కట్టడాలకు ముప్పు పొంచి ఉందంటూ జర్దారీ చేసిన ఆరోపణలను తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా, అనాలోచితంగా ఉన్నాయని పేర్కొంది. అంతేకాదు, భారత్ అంతర్గత విషయాలపై మాట్లాడే నైతిక అర్హత దాయాదికి లేదని ఖరాఖండిగా చెప్పారు. పాకిస్థాన్‌పై మైనార్టీలపై జరుగుతున్న దాడులపై రణధీర్ జైస్వాల్ ప్రశ్నించారు. సొంత దేశంలో మానవ హక్కులను కాలరాస్తూ, మైనారిటీలను అణచివేస్తున్న పాకిస్తాన్ భారత్‌కు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొంది. పొరుగుదేశంలో దశాబ్దాలుగా హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, ఇతర మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని, వారిపై దాడులు చేస్తూ, వేధింపులకు గురిచేస్తున్న విషయం ప్రపంచానికి బాగా తెలుసు అని స్పష్టం చేసింది. అంతేకాకుండా, పాక్ అధ్యక్షుడి వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని కూడా భారత్ ప్రస్తావించింది. భారత్‌పై అంతర్జాతీయంగా బురదజల్లడానికి, పాకిస్థాన్ అనుసరిస్తున్న విద్వేషపూరిత విధానాలకు ఈ వ్యాఖ్యలు పరాకాష్ట అని విదేశాంగ శాఖ పేర్కొంది.'పాకిస్థాన్ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. భారత అంతర్గత విషయాలపై వ్యాఖ్యానించడానికి ఆయనకు ఎలాంటి హక్కు లేదు. సొంత దేశంలోనే మానవ హక్కుల విషయంలో పాకిస్థాన్‌కు ఉన్న రికార్డును బట్టి చూస్తే, ఈ వ్యాఖ్యలు మరీ హాస్యాస్పదంగా ఉన్నాయి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు ఉన్నాయి. వివిధ మతాలకు చెందిన మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని, వారిని వేధింపులకు గురిచేస్తున్న పాకిస్థాన్ చరిత్ర అందరికీ తెలిసిందే' అని రణధీర్ అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తన అధికారిక సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వేదికగా భారత్‌కు వ్యతిరేకంగా తీవ్రమైన ఆరోపణలు చేశారు. యూపీలోని వారణాసిలో సుమారు 1,000 సంవత్సరాల నాటి 'మస్జిద్ గంజ్ షహీదా' కూల్చివేతకు ముప్పు పొంచి ఉందని అందులో పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఆయన భారత్‌ను కోరారు, లేనిపక్షంలో ఇవి భారత్ విచ్ఛిన్నానికి, దేశంలో అశాంతికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి చర్యలను వెంటనే అడ్డుకోవాలని, మైనారిటీల హక్కులు, ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న పాకిస్థాన్, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చర్చల సందర్భంగా జమ్ముకశ్మీర్, భారత్‌లోని మైనారిటీల పరిస్థితిని ప్రస్తావిస్తూ ఆరోపణలు చేసింది. పాక్ వ్యాఖ్యలను భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదానికి అడ్డాగా మారిన పాకిస్థాన్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు నీతులు చెప్పడం హాస్యాస్పదమని భారత్ ఎండగట్టింది.

## రైల్వే ప్రయాణికులకు భారీ షాక్

మొదటిపేజీ తరువాయి..

విధించనుంది. కాజీపేటలో ఆర్పీఎఫ్ అధికారులు దీనికి సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. టికెట్ లేని ప్రయాణం, మహిళల కోచ్‌లోకి ప్రవేశించడం, ధూమపానం వంటి పలు నేరాలకు జరిమానాలు భారీగా పెంచారు. ఫైన్ కట్టకుంటే కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపనున్నారు. ట్రైన్లలో ప్రయాణించే ప్రయాణికుల భద్రతను పటిష్టం చేయడానికి, స్టేషన్లలో, రైళ్లలో క్రమశిక్షణను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే ప్రాంగణాల్లో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా దశాబ్దాల నాటి 1989 రైల్వే చట్టంలో విప్లవాత్మక మార్పులు చేస్తూ సవరణలు తీసుకువచ్చింది. జన విశ్వాస్ పేరిట ప్రవేశపెట్టిన ఈ నూతన చట్ట సవరణల ద్వారా రైల్వే రక్షక దళానికి అపరిమితమైన అధికారాలను కల్పించారు. గతంలో ఆర్పీఎఫ్ అధికారులకు నేరుగా జరిమానాలు వసూలు చేసే అధికారం ఉండేది కాదు. కానీ మారిన నిబంధనల ప్రకారం ఈ నెల 15వ తేదీ నుంచే ఆర్పీఎఫ్ సిబ్బంది తప్పు చేసిన వారికి అక్కడికక్కడే భారీ జరిమానాలు విధించేలా చట్టాన్ని మార్చారు. ఈ సరికొత్త చట్టాలపై ప్రయాణికుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ ఛటర్జీ, ఎస్సై వెంకట్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే ఆస్తులను రక్షించడంతో పాటు ప్రయాణికుల ప్రయాణాన్ని సుఖమయం చేయడానికే ఈ కఠిన నిబంధనలు తెచ్చినట్లు పేర్కొన్నారు. కొత్త నిబంధనల ప్రకారం.. టికెట్ లేకుండా ప్రయాణించినా, అనుమతించిన దూరం కంటే అదనంగా ప్రయాణించినా.. లేదా ఇతరుల పేరుతో ఉన్న టికెట్లపై ప్రయాణానికి ప్రయత్నించినా సదరు ప్రయాణ ఛార్జీలతో పాటు రూ.500 అదనపు పెనాల్టీని వసూలు చేస్తారు. అలాగే రైళ్లలో, ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగించే అనధికారిక తినుబండారాల విక్రేతలకు, భిక్షాటన చేసే వారికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తారు. రైల్వే ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే వెయ్యి నుంచి రూ.2 వేల వరకు, రైల్వే ప్రాంగణాల్లోకి అనుమతి లేకుండా అనధికారికంగా ప్రవేశిస్తే రూ.500 ఫైన్ వేస్తారు. ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించిన రిజర్వ్ కోచ్‌లలో అనధికారికంగా ప్రవేశిస్తే రూ.2 వేల జరిమానా ఉంటుంది. ఒకవేళ పొరపాటున ఎక్కినప్పటికీ.. సీటు లేదా బెర్తును ఖాళీ చేయడానికి నిరాకరిస్తే రూ. వెయ్యి అదనంగా వసూలు చేస్తారు. రైల్వే ట్రాఫిక్ సంకేతాలను ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మహిళల భద్రతకు రైల్వే శాఖ అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది.

# 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 ఘనంగా జరుపుకున్నదక్షిణ మధ్య రైల్వే

సాక్ష్యం, హైదరాబాద్:

దక్షిణ మధ్య రైల్వే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈరోజు అనగా జూన్ 21 2026న నిర్వహించింది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సొసైటీకి రాష్ట్ర కోఆర్డినేటర్ మరియు ప్రఖ్యాత యోగా గురువు అయిన శ్రీ మురారి మోహన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ సిద్ధార్థ్ కటి, ఇతర ప్రధాన శాఖాధిపతులు, అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ & గైడ్స్, పాఠశాల విద్యార్థులు మరియు యోగా ఔత్సాహికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జోన్‌లోని ఇతర సిబ్బంది మరియు అధికారులు పాల్గొనడానికి వీలుగా ప్రోగ్రామ్ యొక్క ప్రత్యక్ష ప్రసారం దక్షిణ మధ్య రైల్వే సోషల్ మాధ్యమం ద్వారా కూడా ప్రసారం చేయడం జరిగింది. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క ఇతివృత్తం "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా". ప్రపంచవ్యాప్తంగా జనాభా వృద్ధాప్యం వైపు పయనిస్తున్న కొద్దీ, దీర్ఘాయువు, చలనశీలత, స్వాతంత్ర్యం మరియు సంపూర్ణ శ్రేయస్సును ప్రోత్సహించడంలో ఈ ప్రాచీన అభ్యాసం యొక్క ప్రాముఖ్యతను ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది. ఇది అన్ని వయసుల వారిలోఒత్తిడిని తగ్గించడానికి మరియు శారీరక ధృఢత్వాన్ని మెరుగుపరచడానికి సున్నితమైన కదలికలు,వ్యాయామాలు మరియు శ్వాసాభ్యాసాలు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యాలతో సన్నిహితంగా ఉంటుంది. శ్రీ మురారి మోహన్ గారు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం మొదలైన అంశాలతో కూడిన యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ మురారి మోహన్ యోగా అనేది జీవనోత్సవం అని, శరీరాన్ని శుద్ధి చేయడానికి, మనసును ఒత్తిడుల నుండి విముక్తి చేయడానికి, ఆత్మను ఉత్తేజపరచడానికి ఇది ఒక మార్గమని పేర్కొన్నారు. యోగా కేవలం ఒక శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనస్సు మరియు ఆత్మల సంపూర్ణ సమన్వయానికి దారితీసే మార్గమని, ఇది అంతిమంగా ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తుందని కూడా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ గారు మెరుగైన శారీరక, మానసిక శ్రేయస్సు కోసం యోగాను దైనందిన జీవనశైలిలో భాగం చేసుకుంటామని వాగ్దానం చేస్తూ, పాల్గొన్నవారితో యోగ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఈ రోజు జరిగిన యోగా శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, ఒత్తిడి రహిత జీవనంపై విలువైన సూచనలు అందించిన ప్రముఖ యోగా గురువు శ్రీ మురారీ మోహన్ ను దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ గారు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముందు, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐ.వై.డి–2026) ప్రత్యక్ష ప్రసారాన్ని అదనపు జనరల్ మేనేజర్ గారితో పాటు ఇతర అధికారులు, సిబ్బంది ఆసక్తిగా వీక్షించారు. భారత గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ఇతర విశిష్ట అతిథులతో కలిసి కోల్‌కతాలో జరిగిన ఈ ప్రధాన కార్యక్రమంలో పాల్గొని, అక్కడ భారీగా తరలివచ్చిన యోగా సాధకులను, అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు.

# యర్రగొండపాలెంలో పసుపు జెండా రెపరెపలు ఖాయం : ఎరిక్షన్ బాబు

**టీడీపీ విజయ దుందుభికి రంగం సిద్ధం...**

**ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు దూకుడుతో ముసుగు కోటరీ ఖాళీ - క్యాడర్ ఏకతాటిపైకి..**

**చంద్రబాబు పాలనే శ్రీరామరక్ష అంటున్న నియోజకవర్గ ప్రజానీకం...**

మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం

యర్రగొండపాలెం గడ్డ టీడీపీ అడ్డా అనే నినాదం మళ్లీ



మార్మోగుతోంది.నియోజకవర్గ ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు రాకతో స్తబ్దుగా ఉన్న పసుపు దళంలో కొత్త ఊపు వచ్చింది. వర్గపోరు,ముసుగు రాజకీయాలకు చెక్ పెట్టి, అభివృద్ధి ఎజెండాతో ఎరిక్షన్ బాబు దూసుకుపోతుండటంతో ఈసారి యర్రగొండపాలెంలో టీడీపీ గెలుపు లాంఛనమేనని రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు. 2019,2024 ఎన్నికల్లో ఓటమికి కారణం ప్రజా వ్యతిరేకత కాదు,మన ఇంటి దొంగలే అని టీడీపీ శ్రేణులు తేల్చి చెబుతున్నాయి. బూత్ లెవెల్ డేటా : గత ఎన్నికల్లో 37 బూత్‌లలో 200 ఓట్ల లోపు తేడాతోనే టీడీపీ ఓడింది.ఆ 37 బూత్‌లలో 21 బూత్‌లు టీడీపీ సానుభూతి పరుల గ్రామాలే.కారణం ముసుగు నాయకుల మ్యాచ్ ఫిక్సింగ్. క్యాడర్ బలం : నియోజకవర్గంలో సుమారుగా 18,500 మంది క్రియాశీల టీడీపీ కార్యకర్తలున్నారు.వీరిలో 60% మంది యువత.ఎరిక్షన్ బాబు వచ్చాక గత 2 నెలల్లో 3,200 మంది నూతన సభ్యత్వాలు తీసుకున్నారు. సర్వే రిపోర్ట్ : అంతర్గత సర్వే ప్రకారం చంద్రబాబు సూపర్-6 పథకాలకు యర్రగొండపాలెంలో 72% మంది మహిళలు జై కొడుతున్నారు.తల్లికి వందనం,ఆడబిడ్డ నిధి పై ప్రజల్లో భారీ ఆశలు ఉన్నాయి. వ్యాపారాల కోసం పార్టీని తాకట్టు పెట్టిన వారి పని ఇక ఖతం అని ఎరిక్షన్ బాబు హెచ్చరించారు.పైన చంద్రబాబు రావలంటా..? యర్రగొండపాలెంలో వద్దంటా..? అనే ద్వంద్వ వైఖరి ఇక చెల్లదు.అధిష్ఠానం దగ్గర మొత్తం లిస్ట్ ఉంది.టీడీపీ ముసుగులో వైసీపీతో కుమ్మక్కైన వారిని,కోవర్టు ఆపరేషన్ చేసిన వారిని రెండేళ్ల క్రితమే గుర్తించాం.వారికి పార్టీలో స్థానం లేదు అని ఆయన తేల్చి చెప్పారు.దీంతో నిస్వార్థ కార్యకర్తల్లో కొత్త ధైర్యం వచ్చింది.15 ఏళ్లుగా పార్టీ జెండా మోస్తున్న సీనియర్లు సైతం ఇప్పుడు ఫీల్డ్‌లోకి వచ్చేశారు.

టీడీపీ అంటేనే అభివృద్ధి.ఆ బ్రాండ్‌ను తిరిగి తెచ్చేలా ఎరిక్షన్ బాబు యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. యర్రగొండపాలెం టౌన్ ట్రాఫిక్,డ్రైనేజీ, తాగునీరు 100 కోట్లతో స్మార్ట్ యర్రగొండపాలెం తో సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు,పార్క్. పెద్దారవీడు మండలంలో సాగునీటి సమస్య గుండ్లకమ్మ లిఫ్ట్ పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరు.ప్రతి చెరువులో పూడికతీత. త్రిపురాంతకం మండలంలో అటవీ గ్రామాలకు రోడ్లు లేవు నల్లమల అటవీ బోర్డర్ గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు.గిరిజనులకు పోడు పట్టాలు. దోర్నాల మండలంలో వైద్యం అందక చెంచులు ఇబ్బంది ప్రతి చెంచు పెంటకు మొబైల్ హెల్త్ క్లినిక్.శ్రీశైలం యాత్రికుల కోసం 50 పడకల ఆసుపత్రి. పుల్లలచెరువు మండలంలో యువతకు ఉపాధి లేదు మార్కాపురం-యర్రగొండపాలెం కారిడార్‌లో మినీ ఇండస్ట్రియల్ పార్క్.స్కిల్ సెంటర్. ఐక్యత : ఎరిక్షన్ బాబు వల్ల అన్ని వర్గాలు, అన్ని సామాజిక కులాలు టీడీపీ



గొడుగు కిందకు వచ్చాయి.మాదిగ,మాల,యాదవ, గౌడ,కమ్మ,రెడ్డి,బలిజ కార్యకర్తలు భుజం భుజం కలిపారు. వ్యతిరేకత : వైసీపీ 5 ఏళ్ల పాలనలో రోడ్లు లేవు,నీళ్లు లేవు,ఉద్యోగాలు లేవు.జగన్ రెడ్డి గ్రాఫ్ అట్టడుగుకు పడిపోయింది.జనం మార్పు కోరుకుంటున్నారు. చంద్రబాబు బ్రాండ్ : బాబు వస్తే జాబు వస్తుంది అని యువత,"బాబు వస్తే సంక్షేమం" అని మహిళలు నమ్ముతున్నారు.ఆ నమ్మకమే టీడీపీ బలం. లోకేష్ యువగళం ఎఫెక్ట్ : యర్రగొండపాలెం మీదుగా సాగిన యువగళం పాదయాత్ర యువతలో తుఫాన్ లేపింది.ఆ 12,000 మంది యువత ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియా వారియర్స్. విశ్వసనీయ వర్గాల సమాచారం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యర్రగొండపాలెంను టీడీపీ "క్లీన్ స్వీప్" నియోజకవర్గాల లిస్టులో చేర్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు స్వయంగా 2 సార్లు ఇక్కడ ప్రచారం చేసే అవకాశం ఉంది.కాలం మారుతుంది.ముసుగు వీరులు మారినా మారకపోయినా యర్రగొండపాలెంలో పసుపు జెండా ఎగరడం ఖాయం.ఇది చరిత్ర చెప్పిన సత్యం.ఇది ప్రజల తీర్పు అని ఎరిక్షన్ బాబు సభాముఖంగా ప్రకటించారు.యర్రగొండపాలెం నియోజకవర్గంలో నిస్వార్థమైనా సీనియర్ నాయకుల అభిప్రాయంతో విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మాత్రమే...

# మధ్య ప్రదేశ్ నుంచే రాజకీయాలు చేస్తా

**మొదటిపేజీ తరువాయి..**

ప్రాతినిధ్యం వహిస్తానన్నారు. తెలంగాణ నుంచి ఎవరితోనూ రాజీనామా చేయించి సీటు తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి తాను దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ప్రస్తుతం ఎలాంటి లీగల్ కేసులు లేవని, చట్టబద్ధంగా తాను అన్ని నిబంధనలను పాటించానని స్పష్టం చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఒక పాత కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికార బీజేపీ, ఈసీ లాలూచీపడి, కుట్రపూరితంగా తన నామినేషన్‌ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తన రాజ్యసభ సీటు తీవ్రమైన కుట్రతో చోరీకి గురైందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువులకు విరుద్ధంగా చేస్తున్న కుట్రలను, అక్రమాలను సమాజానికి విడమరిచి చెప్పడానికే తాము ఈ లీగల్ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లు తనకోసం మరొకరితో బలవంతంగా రాజీనామా చేయించి, తెలంగాణ కోటాలో తాను రాజ్యసభ సీటును తీసుకోలేనని చెప్పారు. తాను పుట్టి పెరిగింది, రాజకీయాలు చేసింది మధ్యప్రదేశ్‌లోనే కాబట్టి ఆ రాష్ట్ర ప్రజల తరఫునే తాను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత శత్రువులే మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను ప్రత్యర్థి పార్టీకి అందించారంటూ వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలే ప్రత్యర్థులకు ఇచ్చారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. బీజేపీ తన ఓటమి భయంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపిందని విమర్శించారు. అఫిడవిట్‌లో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన నామినేషన్ తిరస్కరించాల్సిన అవసరం లేదని.. దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. స్క్రూటినీ జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను నామినేషన్ రూమ్‌లోకి అధికారులు ఎందుకు అనుమతించారని ఆమె ఈసీని నిలదీశారు. కాగా, మీనాక్షి నటరాజన్ గతంలో రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలక నేతగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా కూడా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. ఈ నామినేషన్ తిరస్కరణ అంశం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ తిరస్కరణను కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తుండగా.. నిబంధనల ప్రకారమే ఈసీ నిర్ణయం తీసుకుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ లీగల్ టీమ్ ఇప్పటికే కసరత్తు చేస్తోంది.

# దేశవ్యాప్తంగా మిన్నంటిన యోగా సంబరాలు..



**మొదటిపేజీ తరువాయి..**

చాటిచెప్పారు.కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఢిల్లీలో జరిగిన సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. తెల్లటి టీషర్ట్ ధరించి, పద్మాసనంలో కూర్చుని, కళ్లు మూసుకుని ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో ఆయన ధ్యానం చేశారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లక్నోలో జరిగిన భారీ వేడుకకు నాయకత్వం వహించారు. తన సాంప్రదాయ కాషాయ వస్త్రధారణలోనే ఆయన రెండు చేతులను భుజాలపై ఉంచి ఉత్సాహంగా వ్యాయామం చేస్తూ సాధకులను నడిపించారు.క్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నౌకాదళ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. వెన్నెముకను పటిష్టం చేసే అత్యంత కీలకమైన 'భుజంగాసనాన్ని' ఆయన ఎంతో నైపుణ్యంతో ప్రదర్శించారు. బాలీవుడ్ స్టార్ హీరో, ఫిట్‌నెస్ ఐకాన్ అక్షయ్ కుమార్ సైతం సాధారణ ప్రజలతో కలిసి మైదానంలో యోగా మ్యాట్ వేసుకుని ఆసనాలు వేశారు. మొదట వజ్రాసనంలో కూర్చుని మానసిక ఏకాగ్రతను ప్రదర్శించిన అక్షయ్, ఆ తర్వాత తోటి సాధకులతో కలిసి మైదానంలో 'భుజంగాసనం' వేస్తూ తన ఫిట్‌నెస్ చాటుకున్నారు. ఢిల్లీ నుంచి లక్నో వరకు, మైదానాల నుంచి రక్షణ నౌకల వరకు ఎక్కడ చూసినా తెల్లటి దుస్తులు ధరించిన యోగా సాధకులే కనిపించారు. కేంద్ర మంత్రులు, ప్రముఖులు స్వయంగా సామాన్యుల మధ్య కూర్చుని యోగా చేయడం ద్వారా ఈ వేడుకలు కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా మారాయని స్పష్టమవుతోంది. యోగా దినోత్సవ వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఉత్సాహంతో యోగాసనాలు వేశారు. అంతకంటే ముందు ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు చూపిస్తున్న చొరవను కొనియాడారు. ఈ రోజు భౌగోళిక సరిహద్దులను దాటి ఒక భారీ సామూహిక ఉద్యమంగా ఎదిగిందని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పండుగగా రూపాంతరం చెందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. అనంతరం ఆయన అందరితో కలిసి యోగాసనాలు వేశారు. వివిధ ఆసనాలతో ప్రధాని మోదీ సందేశం ఇచ్చారు.

# మెట్రో రెండో దశ నిధుల కోసం ప్రయత్నాలు



**మొదటిపేజీ తరువాయి..**

ప్యాకేజీలో భాగంగా రూ.13,538.53 కోట్ల లోన్ మంజూరు చేసింది. రాష్ట్రం తన వాటా రూ.1,461.47 కోట్లు ఎస్క్రోలో జమ చేసి, ముందస్తు ఫీజు చెల్లించినా నిధుల విడుదల ఆలస్యం అవుతోంది. సీఎం ఈ అంశాలపై స్పష్టమైన చర్చ కోసం అన్ని డాక్యుమెంట్లూ తీసుకొస్తానని తన లేఖలో తెలిపారు. ఈ సమస్యలు త్వరితంగా పరిష్కరించాల్సిన అవసరం హైదరాబాద్ నగర అభివృద్ధికి ఉంది. వంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో మెట్రోతో పాటు ఇతర రైల్వే, అభివృద్ధి అంశాలపై కూడా దృష్టి సారించే అవకాశం ఉంది. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కావడంతో మెట్రో విస్తరణ ప్రజల రవాణా అవసరాలను తీర్చడంతో పాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో మెట్రో ప్రారంభమైనా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాని విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర-రాష్ట్ర సమన్వయం ద్వారా ఈ ప్రాజెక్టులు ముందుకు సాగాలని రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ విమర్శలు కూడా ఉన్నాయి. రేవంత్ ప్రభుత్వం మెట్రో అనుమతులు పొందడంలో ఆలస్యం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, సీఎం ఈ అంశాలను కేంద్రంపై ఒత్తిడి చేసి పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీలో జరిగే సమావేశాలు ఈ పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపుతాయని ఆశిస్తున్నారు.

లోన్ విడుదల, ఫేజ్-2 అనుమతులు త్వరగా వస్తే హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది ఈ పర్యటన తెలంగాణ అభివృద్ధి కోసం ముఖ్యమైనది. సీఎం రేవంత్ రెడ్డి అన్ని డాక్యుమెంట్లతో సిద్ధంగా ఉండి, వాస్తవాలు రికార్డు చేసి సమస్యలు పరిష్కరించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ నగరం రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలు ఈ అభివృద్ధి పనులను ఆశగా ఎదురుచూస్తున్నారు . మొత్తంమీద, జూన్ 22-23 ఢిల్లీ పర్యటన హైదరాబాద్ మెట్రో భవిష్యత్తుకు మైలురాయి కావాలనే ఆకాంక్ష ఉంది. కేంద్ర-రాష్ట్ర సహకారం ద్వారా ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగాలి. తెలంగాణ ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

# 9 మార్గాల్లో వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్..

**మొదటిపేజీ తరువాయి..**

జరుగుతుండగా.. త్వరలోనే వివిధ మార్గాల్లో పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రధాన నగరాలకు కనెక్టివిటీ లభించేలా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. రాత్రిపూట ప్రయణాన్ని మెరుగుపర్చేందుకు వందే భారత్ స్లీపర్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది. హౌరా-గువహతి మధ్య ఈ ఏడాది జనవరిలో తొలి స్లీపర్ ట్రైన్ తీసుకొచ్చారు. ఇప్పుడు తొమ్మిది కొత్త మార్గాల్లో తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, ఆధునీకరణలో భాగంగా వందే భారత్ రైళ్లు స్లీపర్ కోచ్‌లను తీసుకురానుంది.



సాధారణ వందే భారత్ రైళ్లు ఇప్పటికే దేశంలోని ప్రధాన నగరాల మీదుగా నడుస్తోండగా.. స్లీపర్ రైళ్ల ప్రారంభంపై రైల్వేశాఖ దృష్టి సారిస్తోంది. సుదూర ప్రయాణాల కోసం రూపొందించబడిన ఈ రైళ్లు.. రాత్రిపూట ప్రయాణానికి అనువుగా ఉంటాయి. త్వరలో తొమ్మిది రూట్లలో వందే భారత్ స్లీపర్ కోచ్‌లకు ప్రణాళికలు వేసింది. ఢిల్లీ-ముంబై , ముంబై-బెంగళూరు, న్యూఢిల్లీ-అహ్మదాబాద్, న్యూఢిల్లీ- హౌరా, న్యూఢిల్లీ-చెన్నై, న్యూఢిల్లీ-సికింద్రాబాద్, న్యూఢిల్లీ-పుణె, ముంబై-అహ్మదాబాద్, న్యూఢిల్లీ-శ్రీనగర్ మార్గాల్లో ప్రవేశపెట్టనుంది. బలమైన ప్రయాణికుల డిమాండ్, ప్రధాన అంతర్-నగర అనుసంధానాలుగా వాటికి ప్రాముఖ్యత ఉండటంతో ఈ మార్గాలను పరిశీలిస్తోంది. ముంబై-బెంగళూరు వందే భారత్ స్లీపర్ రానున్న కొద్ది నెలల్లో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి రైలు ఫస్ట్ ఏసీ కోచ్ డిజైన్ ఆవిష్కరించారు. ప్రీమియం ఇంటీరియర్స్, ఆధునిక క్యాబిన్‌లు, అప్‌గ్రేడ్ చేయబడిన సౌకర్యాలతో విమానాన్ని తలపించేలా ఉంది. ఈ కోచ్‌లలో శుభ్రమైన అమరిక, మెరుగైన లైటింగ్, ప్రీమియం ఫినిషింగ్‌లు, స్థలాన్ని మెరుగ్గా ఉపయోగించుకోవడం వంటి సౌకర్యాలు ఉన్నాయి. అనుధాతన వాష్‌రూమ్‌లు, సమాచార ప్రదర్శన వ్యవస్థలు, పటిష్టమైన భద్రతా చర్యలు. సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. ఢిల్లీ-సికింద్రాబాద్ మధ్య తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రానుంది. ప్రస్తుతం ఈ మార్గంలో రాజధాని ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా.. ఇందులో ప్రయాణించాలంటే చాలా సమయం పడుతుంది. అదే వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వస్తే వేగవంతంగా ప్రయాణం చేయవచ్చు. ఈ రూట్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వందే భారత్ స్లీపర్ తీసుకురావడం వల్ల రాత్రిపూట ప్రయాణం చేసేవారికి ఊరట కలగనుంది. హాయిగా సౌకర్యవంతమైన ప్రయాణం చేసే అవకాశ లభిస్తుంది.

# గాంధీ పేరుతో రేవంత్‌రెడ్డి మూసీ విధ్వంసం

**మొదటిపేజీ తరువాయి..**

దుర్మార్గపు పాలన కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శంషాబాద్ జేడీ కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మూసీ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న విధ్వంస రాజకీయాలకు బీజేపీ కూడా మద్దతు ఇస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. చోటే భాయ్.. బడే భాయ్ ఇద్దరూ కలిసి మూసీ భూములు కూలగొడుతున్నారని విమర్శించారు. నిజంగానే మోదీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాకోవద్దని, పేదలకు అన్యాయం చేయవద్దని ఎందుకు ప్రశ్నించరు అని నిలదీశారు.



ఒకవైపు స్థానికంగా మూసీ ప్రజలను మోసం చేస్తున్నారని స్థానిక బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి మాట్లాడుతుంటే.. కేంద్రంలోని ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూలగొట్టమని అనుమతులు ఇస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్లు దాటినా ఒక హామీ కూడా నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. మూసీ కోసం మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. కేవలం రాహుల్‌గాంధీకి ప్రతినెలా కమీషన్లు పంపేందుకే రేవంత్‌రెడ్డి ఇన్ని అరాచకాలు చేస్తున్నారని, డబ్బు కట్టలు పంపి రెన్యువల్ చేసుకోకుంటే ముఖ్యమంత్రి పదవి పోతుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం లేదని కేవలం ఒక మాఫియా రాజ్యం నడుస్తున్నదని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దండుపాళ్యం ముఠాకు నాయకుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తుంటే.. ఆయన ఆధ్వర్యంలో దోచుకో.. దాచుకో అన్నట్టుగా మంత్రులంతా కలిసి స్కామ్‌లు చేస్తున్నారని విమర్శించారు. సామాన్యుల భూములు లాకొని గూండాయిజం చేసే రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు గూండాయిజాన్ని ప్రతి ఒకరూ చూశారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కనుసన్నల్లోనే శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రాసిచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. రెండున్నరేండ్లుగా హైదరాబాద్‌లో ఒక ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం.. వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి కేవలం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకునేందుకే ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారితే ఈ రెండున్నరేండ్లలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ ప్రజలకు ద్రోహం చేశాడని విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే పోయినా బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి ధోకా లేదని, రాజేంద్రనగర్‌లో పార్టీ బాధ్యతలు కార్తిక్‌రెడ్డి భుజాల మీద ఉన్నదని కేటీఆర్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా చేసి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల కోసం వామపక్షాల సమర శంఖం

నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు సాధించడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు విద్యుత్ ఉద్యమం తరహాలో సరికొత్త పోరాటానికి రెడీ అయ్యాయి. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లలో పేదల గుడిసెలను అర్ధరాత్రి వేళ అక్రమంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న హనుమకొండలో 10 వేల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అలాగే జూలై 1న కలెక్టరేట్ల ముట్టడి, జూలై 6న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టి, సేకరించిన దరఖాస్తులను నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. తెలంగాణలోని నిరుపేదలకు ఇళ్లు, నివాస స్థలాల హక్కులను సాధించడమే పరమావధిగా వామపక్ష పార్టీలు మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధమయ్యాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన విద్యుత్ ఉద్యమం తరహాలోనే.. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వామపక్ష నేతలు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్‌తో కలిసి ఈ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు, పోలీసులు అమానవీయంగా తొలగించడాన్ని వామపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఇళ్లు లేక ఆశ్రయం పొందుతున్న పేదలకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఈ నెల 27వ తేదీన హనుమకొండ నగరంలో దాదాపు 10 వేల మంది నిరుపేదలతో కలిసి భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి పేదల ఆగ్రహాన్ని రుచి చూపిస్తామని హెచ్చరించారు. జూలై 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## గీతంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్ష్యం , విశాఖపట్నం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రారంభమైన కార్యక్రమంలో యోగా నిపుణులు శ్వాస వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం, వివిధ యోగాసనాలను ప్రదర్శించి పాల్గొన్న వారితో సాధన చేయించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి,




శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి, మానసిక ప్రశాంతతను సాధించడానికి యోగా ఎంతో ఉపయోగకరమని వారు వివరించారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ వై. గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, విద్యార్థి సంక్షేమ విభాగ సహాయ డీన్ అరుణ్ కార్తీక్ తదితరులు మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది సంపూర్ణ జీవన విధానమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న 'యోగాంధ్ర' కార్యక్రమం స్ఫూర్తితో యువత, విద్యార్థులు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, ఇంజినీరింగ్, విజ్ఞాన శాస్త్రాలు, నిర్వహణ విద్య విభాగాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాభ్యాసం నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

## యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలి: హోంమంత్రి వంగలపూడి అనిత

సాక్ష్యం , విశాఖపట్నం

ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు







యోగ పక్షోత్సవాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని పేర్కొంటూ, నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమన్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

గత ఏడాది విశాఖపట్నంలో మూడు లక్షల మందికి పైగా పాల్గొని యోగా ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించిన విషయాన్ని గుర్తు చేసిన హోంమంత్రి, యోగాను ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి, రాష్ట్రంలో యోగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ, గత నెల రోజులుగా జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్ "యోగ ఫర్ హెల్తీ ఏజింగ్" అని, ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి యోగా పోటీల విజేతలు, విశిష్ట సేవలు అందించిన యోగా గురువులను సత్కరించారు.

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'ఈగల్ 1972' పోస్టర్ల ఆవిష్కరణ

### యోగాంధ్రా వేదికగా ఈగల్ సేవలకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

సాక్ష్యం , విశాఖపట్నం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 'యోగాంధ్రా' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్, రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వ్యసనముక్త భారత్ అభియాన్' ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా 'ఈగల్ 1972' పోస్టర్లను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈగల్ ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా భద్రతా చర్యలు, అవగాహన కార్యక్రమాల గురించి ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ముఖ్యమంత్రికి వివరించారు. ఈగల్ సంస్థ చేపడుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలు, సేవలను తెలుసుకున్న ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.




భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచిస్తూ ఈగల్ బృందాన్ని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీషా, , విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు, , పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వేలాది మంది ప్రజలు, యువత, యోగా సాధకుల భాగస్వామ్యంతో నిర్వహించిన 'యోగాంధ్రా' కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం జరిగిన 'ఈగల్ 1972' పోస్టర్ల ఆవిష్కరణ ఈగల్ సంస్థకు మరింత గుర్తింపు తీసుకువచ్చింది. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ జి. స్వరూపారాణి, ఈగల్ హెడ్‌క్వార్టర్స్ డీఎస్పీ కె. సింగయ్య, విజయవాడ ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీంద్రతో పాటు ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026

సాక్ష్యం, విశాఖపట్నం:

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అక్కయ్యపా







లెంలోని పోర్ట్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జె.ఎస్. బింద్రా యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ఆరోగ్యవంతమైన మరియు ఒత్తిడిలేని జీవనానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన యోగా గురువు పాల్గొనేవారికి యోగాసనాలు, శ్వాసాభ్యాసాలు, ధ్యాన విధానాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా పోర్ట్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి కోరటి, పోర్ట్ కార్యదర్శి ఎం. శంకర్ బాబు ,ముఖ్య విజిలెన్స్ అధికారి అరుణ్ ప్రసాద్ టి., వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

**హెచ్ఎస్ఎల్‌లో ఘనంగా యోగా దినోత్సవం**

అంతర్జాతీయ యోగా దినోత్సవం–2026ను హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఆదివారం ఘనంగా నిర్వహించింది. "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా" అనే థీమ్‌తో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హెచ్ఎస్ఎల్ సీఎండీ (అదనపు బాధ్యతలు) కెప్టెన్ గంటి వెంకటేశ్వర్లు (ఐఎన్ రిటైర్డ్) మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలి కోసం యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అలాగే 86వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు సేఠ్ వాల్చంద్ హీరాచంద్‌కు ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో తన సేవలను కొనసాగిస్తూ ఉద్యోగుల సంక్షేమానికి హెచ్ఎస్ఎల్ కట్టుబడి ఉందని సంస్థ తెలిపింది.

**దక్షిణ కోస్తా రైల్వేలో ఘనంగా యోగా దినోత్సవం**

దక్షిణ కోస్తా రైల్వే ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో నిర్వహించిన తొలి యోగా దినోత్సవం కావడంతో కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, ఎస్సీఓఆర్డబ్ల్యూవో అధ్యక్షురాలు చారు మాథుర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాథుర్ మాట్లాడుతూ, "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా" అనే ఈ ఏడాది థీమ్‌కు అనుగుణంగా ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఉత్తమ సాధనమని పేర్కొన్నారు. యోగాను జీవనశైలిగా స్వీకరించి ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఇగ్నోలో ఘనంగా యోగా దినోత్సవం**

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎం.వి.పి. కాలనీలోని కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు మాట్లాడుతూ, "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే ఈ ఏడాది థీమ్‌కు అనుగుణంగా యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యోగా ఆసనాల ప్రదర్శనతో పాటు ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వీసీబీఎల్ డివిడెండ్ 10 శాతం ప్రకటింపు

### రూ.66.15 కోట్ల నికర లాభం – 8 కొత్త శాఖల ఏర్పాటుకు సన్నాహాలు

సాక్ష్యం , విశాఖపట్నం

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (వీసీబీఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 10 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ మేరకు బ్యాంకు చైర్మన్ జే.వి. సత్యనారాయ




ణమూర్తి వెల్లడించారు. డివిడెండ్ చెల్లింపుల కోసం రూ.39.24 కోట్లను కేటాయించగా, మిగిలిన లాభాలను చట్టపరంగా నిర్దేశించిన నిష్పత్తుల ప్రకారం వివిధ రిజర్వు ఖాతాలకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలోని సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ అరేనాలో నిర్వహించిన వీసీబీఎల్ మహాజన సభలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. బ్యాంకు అధ్యక్షుడు జామిశెట్టి వెంకట సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పరిపాలనా నివేదిక, ఆడిట్ నివేదిక, లాభాల పంపిణీ ప్రతిపాదనలు, సవరించిన బడ్జెట్, అంచనా బడ్జెట్‌తో పాటు 2026-27 సంవత్సరానికి స్టాట్యూటరీ ఆడిటర్ నియామకానికి సంబంధించిన అంశాలను సభ్యుల ఆమోదానికి ఉంచారు.

జే.వి. సత్యనారాయణమూర్తి తన అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.240.24 కోట్ల మేర పెరిగి రూ.4,594.97 కోట్లకు చేరుకున్నాయని, ఇది 5.52 శాతం వృద్ధిని సూచిస్తుందని తెలిపారు. అదే సమయంలో రుణాలు రూ.440.95 కోట్ల మేర పెరిగి రూ.3,877.42 కోట్లకు చేరుకుని 12.83 శాతం వృద్ధిని నమోదు చేశాయని చెప్పారు. మొత్తం వ్యాపారం రూ.681.19 కోట్ల పెరుగుదలతో రూ.8,472.39 కోట్లకు చేరుకుని 8.74 శాతం వృద్ధి సాధించిందని వివరించారు. మార్చి 31, 2026 నాటికి బ్యాంకు రూ.66.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుకు 60 శాఖలు ఉండగా, 1,17,884 మంది సభ్యులు ఉన్నారని వెల్లడించారు. బ్యాంకు షేర్ క్యాపిటల్ రూ.416.25 కోట్లకు చేరుకోవడం సంస్థ ఆర్థిక బలాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

రిజర్వు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ఈ ఏడాది మరో 8 కొత్త శాఖలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నంద్యాల, అన్నమయ్య, సత్యసాయి, మార్కాపురం జిల్లాల్లో ఒక్కో శాఖ, విశాఖపట్నంలో మరో శాఖ, తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం నగరాల్లో శాఖలు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో ఒక శాఖను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ విస్తరణతో బ్యాంకు శాఖల సంఖ్య 68కు చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే విజయవాడలోని స్వశక్తి మర్కంటైల్ కోఆపరేటివ్ బ్యాంకు, గుంటూరులోని మహిళా కోఆపరేటివ్ బ్యాంకు, సాలూరు కోఆపరేటివ్ బ్యాంకుల విలీన ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. గాజువాకలో కొత్త శాఖ భవనం, విజయవాడ పటమటలో జోనల్ కార్యాలయం మరియు శాఖ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా 97వ రాజ్యాంగ సవరణలకు వ్యతిరేకంగా డైరెక్టర్లు వి. చంద్రశేఖర్, డా. సి. కృష్ణమోహన్, ఉప్పలపాటి పార్వతిదేవి, చలసాని రాఘవేంద్రరావు ప్రవేశపెట్టిన తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, కో-ఆప్టెడ్ సభ్యులు, సీఈఓ వీవీబీ వరలక్ష్మి , డిప్యూటీ సీఈఓ ఎం.వి. గణేష్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎన్. ప్రసాద్, 60 శాఖల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

* అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సీఎం చంద్రబాబు
* యోగాంధ్ర–2026కు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు

సాక్ష్యం , విశాఖపట్నం.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఇంటింటికీ యోగాను చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ యోగాసనాలు







నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సేవలను సీఎం ప్రశంసించారు. సాంకేతికతకు ఆధ్యాత్మికతను అనుసంధానిస్తే అభివృద్ధి అప్రతిహతంగా సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. యోగాంధ్ర కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయడంతో పాటు జిల్లా, మండల స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు.

ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించిన సీఎం, యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రతి రోజు యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తిరుపతిలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఇదే సందర్భంగా 'యోగాంధ్ర–2026' కార్యక్రమానికి లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష్యాన్ని మించి 1.07 కోట్ల మంది యోగా కార్యక్రమాల్లో నమోదు చేసుకోవడం ద్వారా ఈ ఘనత సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ రికార్డు ధృవీకరణ పత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.32 లక్షలకుపైగా కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించగా, వేలాది మంది శిక్షకులు, యోగా గురువులు సేవలందించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించిన పోటీలు యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాయని అధికారులు పేర్కొన్నారు.

## దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

### జయశంకర్ ఆశయ
# సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**– నల్లగొండ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, మాచనపల్లి ఉప సర్పంచ్ జోగు నగేష్**



**మాడుగులపల్లి జూన్ 21 సాక్ష్యం;**
జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లగొండ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, మాచనపల్లి ఉప సర్పంచ్ జోగు నగేష్ అన్నారు. ఆదివారం తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నల్గొండ నగర టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని ధారపోశారన్నారు.బాల్యం నుంచే తెలంగాణ అస్తిత్వం కోసం, సామాజిక రాజకీయ చైతన్యంతో ఆలోచన చేస్తూ, అందుకు తగ్గ భావజాల వ్యాప్తిని కొనసాగించిన నిస్వార్థ మేధావి,తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమాన్ని తాను ముందుకు తీసుకుపోయే క్రమంలో తన ఆలోచనలకు జయశంకర్ దిక్సూచిగా నిలిచారని తెలిపారు.

### కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా
# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
### కిట్స్ విద్యాసంస్థ చైర్మన్ నీల సత్యనారాయణ

**కోదాడ జూన్ 21, (సాక్ష్యం)**
కోదాడ లో ని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధి గా ప్రముఖ హార్ట్ ఫుల్నెస్ నిపుణులు కనకదుర్గ పాల్గొని యోగ ఆవశ్యకతను విద్యార్థి నులకు, విపులంగా వివరించారు. యోగ ఆవశ్యకతను వివరిస్తూ యోగ అంటే జీవితాన్ని మన ఆధీనంలోకి







తెచ్చుకోవడం అని, మానవాళికి అందుబాటులో ఉన్న అతి పెద్ద భాగ్యం యోగ అని, యోగ సంతోషాన్ని, సౌఖ్యాన్ని కూడా ఏక కాలం లో అందిస్తుందని, యోగ ఆసనాలు ఒత్తిడిని దూరం చేస్తాయని వివరించారు. కిట్స్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి నులు యోగ ను దిన చర్య గా పాటించాలని, యోగ తోనే సంపూర్ణ ఆరోగ్య వంతులు గా ఉంటారని అన్నారు. యోగ కార్యక్రమం లో ప్రముఖ బ్రీతింగ్ కోచ్ నిపుణులు గెల్లా. బద్రీనాథ్ పాల్గొని, విద్యార్థినులకు బ్రీతింగ్ మెలుకువ లు నేర్పించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ భారతి ట్రస్ట్ నిర్వాహకులు రాజశేఖర్, హార్ట్ ఫుల్ నెస్ శిక్షకులు నారాయణ రెడ్డి, కళాశాల అధ్యాపకులు రమేష్, తమేష్, విద్యార్థి నులు పాల్గొన్నారు.

# డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి
### సుంకర అబీదర్ నాయుడు



**కోదాడ జూన్ 21,( సాక్ష్యం)**
తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ తెలంగాణ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కోదాడ పట్టణం హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు సుంకర అభిధర్ నాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట సాధన ధ్యేయంగా నాలుగు కోట్ల ప్రజల గుండెలలో ఉద్యమ స్ఫూర్తి నిప్పిన సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పోతాడని, ఆయన తన జీవితాంతం తెలంగాణ భావజాల వ్యాప్తికోసం కృషి చేసిన త్యాగధనుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జయశంకర్ గారి పోరాటం త్యాగం మరువలేనిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో
# ప్రొఫెసర్ జయశంకర్ 15 వ వర్ధంతి వేడుక

**పాలకుర్తి జూన్ 21(సాక్ష్యం):**
తెలంగాణ సిద్ధాంతకర్త అనే బిరుదు వట్టి మాట కాదు. ప్రొఫెసర్ జయశంకర్ 40 ఏళ్ల రక్త తపస్సుకు ఇచ్చిన పేరు. నేడు ఆయన 15వ వర్ధంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు అబ్బోజు యాకస్వామి, ప్రధాన కార్యదర్శి కందుకూరు రాజేందర్ చారి పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండు ఎదురుగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు ఈ 3 మాటలతో కోట్ల గొంతుకలకు ప్రాణం పోసిన మహామనీషి అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల విశ్వబ్రాహ్మణ ఉపాధ్యక్షుడు గాంధారి రమేష్, ఉపేంద్ర చారి, పట్టణాధ్యక్షుడు గాంధారి సంపత్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



### యర్రగొండపాలెంలో
# లిక్కర్ మాఫియా సామ్రాజ్యం..!



ఆబ్కారీ శాఖలో కొందరి అధికారుల అవినీతి కుంభకోణం బట్టబయలు..?ఒక్క క్వార్టర్కు ఒక కుటుంబం బలి..!మండలంలో నెత్తురోడుతున్న బెల్ట్ షాపులు మామూళ్లు ఇస్తే చాలు..విషం అమ్ముకున్నా కేసు ఉండదు..మాఫియా లీడర్ల బరితెగింపు..కలెక్టరేట్ ముందు శవయాత్రకైనా సిద్ధం..మహిళల శపథం..ఎరిక్షన్ బాబూ..మీరు రాకపోతే మా బిడ్డలను ఎవరు కాపాడతారు..?తల్లుల ఆక్రందన..?

**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం**
ఇది యర్రగొండపాలెం నియోజకవర్గం కాదు, లిక్కర్ మాఫియా సామ్రాజ్యం. ఇది పరిపాలన కాదు, బహిరంగ దోపిడీ. వైసీపీ నేతల కనుసన్నల్లో, ఆబ్కారీ అధికారులలో కొందరు కళ్లు మూసుకు పోవడంతో యర్రగొండపాలెం మండలం మొత్తం విషపు మద్యం కోరల్లో చిక్కుకుంది.

**రక్తంతో తడిసిన రూపాయలు – ఒళ్లు గగుర్పొడిచే నిజాలు..**
ఒక్క మండలంలోనే 52 బెల్ట్ షాపులు – యమపాశాలుగా..?అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 7కూడా లైసెన్స్ షాపులు లేవు..కానీ క్షేత్రస్థాయిలో 52 అక్రమ బెల్ట్ షాపులు..?ఒక్క యర్రగొండపాలెం బస్టాండ్ సెంటర్లోనే 4 బెల్టు షాపులు.స్కూల్ పిల్లలకు చాక్లెట్లు అమ్మే చోటే మద్యం అమ్మకాలు.

**విషం కలిపిన కిక్కు...**
“ఒరిజినల్ క్వార్టర్లో స్పిరిట్,నీళ్లు, నిద్రమాత్రలు కలిపి 2 క్వార్టర్లు చేస్తున్నారు. తాగినవాడు 3 రోజులు లేవడు.లివర్,కిడ్నీలు పాడైపోయి శవమైపోతున్నాడు”అని ఒక బెల్ట్ షాపులో పనిచేసే వ్యక్తే రహస్యంగా వెల్లడించాడు.గత 6 నెలల్లో మండలంలో అనుమానాస్పద మరణాలు 17.

**ప్రైవేట్ లిక్కర్ రేటు దోపిడీ – రోజుకు రూ.10 లక్షల దందా...**
రూ.120 క్వార్టర్ను రూ.180కి అమ్ముతున్నారు.రోజుకు ఒక్కో షాపులో 200 క్వార్టర్లు.52 షాపులు × 200 × రూ.60 అదనపు దోపిడీ = రోజుకు రూ.6,24,000. నెలకు రూ.1.87 **కోట్ల అక్రమార్జన.ఈ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్తోంది..?**
మామూళ్ల మత్తులో అబ్కారీశాఖలో ఓ అధికారికీ నెలకు రూ.2.50వేలు,మరొక అధికారికీ కి రూ1.30 వేలు,మరికొందరికీ యాబ్బై వేలంటా..?ఇదీ రేటు.అందుకే మమ్మల్ని ఎవడూ టచ్ చేయడు” అని ఓ బెల్ట్ షాపు యజమాని విలేకరుల ముందే సవాల్ విసిరాడు.

**మా మంగళసూత్రాలు తెంచకండి మహాప్రభో.. – మహిళల గుండెకోత..!**
“నా కొడుకు వయసు 19 ఏళ్లు.బడి మానేసి తాగుడుకు బానిసయ్యాడు.ఆ బెల్ట్ షాపోడు ఉచితంగా రెండు పీక్లు పోయించి నా బిడ్డను వ్యసనానికి అలవాటు చేశాడు. ఇప్పుడు రోజూ డబ్బుల కోసం నన్నే కొడుతున్నాడు” అని మండలంలోని చెంచు తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.ఇలాంటి కథలు వందలు. యర్రగొండపాలెంలో ప్రతి వీధిలోనూ ఒక విధవరాలు,ప్రతి ఇంట్లోనూ ఒక తాగుబోతు.

**జిల్లా కలెక్టర్ స్పందిచాలి..?**
మార్కాపురం కలెక్టర్కు వందల అర్జీలు, వందల ఫోన్ కాల్స్.అయినా చర్యలు శూన్యం..ఒకసారి మారువేషంలో వచ్చి మా ఊర్లో బెల్ట్ షాపులు చూడాలి అని మహిళలు నిప్పులు చెరిగారు.నేడు కలెక్టరేట్ ముట్టడి కాదు,అవసరమైతే అక్కడే నిరాహార దీక్ష, శవయాత్రలకైనా సిద్ధమని వారు హెచ్చరించారు..!

**ఎరిక్షన్ బాబూ..మీరే చివరి ఆశ..?**
“వైసీపీ వాళ్లకు మా ఓట్లు కావాలి కానీ మా బతుకులు అవసరం లేదు.చంద్రబాబు మా దేవుడు.టీడీపీ వస్తేనే మా ఇళ్లలో దీపాలు వెలిగేది.ఎరిక్షన్ బాబు మీరు ఒక్కసారి మా గడప తొక్కి ఈ బెల్ట్ షాపుల సంగతి తేల్చండి.మీరు మాట ఇస్తే చాలు, యర్రగొండపాలెంలో ప్రతి ఆడబిడ్డ ఓటు టీడీపీకే.మీరు గెలవడం ఖాయం “ అని వేలాది మంది మహిళలు రోదిస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు.

**టీడీపీ వార్నింగ్ : గెలిచిన 24 గంటల్లో మాఫియా జైలుకే..!**
ఈ దారుణంపై టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు స్పందిస్తూ “యర్రగొండపాలెం ఆడబిడ్డల కన్నీళ్లు చూశాక నాకు నిద్ర పట్టడం లేదు.వైసీపీ మాఫియా,అవినీతి ఆబ్కారీ అధికారులు వినండి.మీ ఆటలు ఇక చెల్లవు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో మండలంలో ఒక్క బెల్ట్ షాపు కూడా ఉండదు. ఒక్కో నకిలీ మద్యం బాటిల్కు లెక్క చెప్పిస్తాం.మా అక్కచెల్లెళ్ల ఉసురు పోసుకున్న మిమ్మల్ని జైలు ఊచలు లెక్కపెట్టిస్తాం.ఇది నా శపథం.ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆజ్ఞ” అని హెచ్చరించారు.

**ఇక తేలిపోయింది : యర్రగొండపాలెంలో టీడీపీ తుఫాన్..?**
లిక్కర్ మాఫియా,అవినీతి అధికారులు, వైసీపీ దోపిడీదారులు అందరూ ఏకమైనా యర్రగొండపాలెం ప్రజల ఆగ్రహం ముందు నిలబడలేరు.ఈసారి ఎన్నికలు మద్యం మాఫియాకు,ప్రజలకు మధ్య యుద్ధం.ఈ యుద్ధంలో గెలిచేది ప్రజలే,గెలిపించేది టీడీపీయే.యర్రగొండపాలెం గడ్డ మీద పసుపు జెండా ఎగరడం చరిత్ర రాసిపెట్టిన సత్యం.

### ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్కి పిలుపు నిచ్చిన
# ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్

**దేవరకొండ: జూన్ 21 (సాక్ష్యం)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమవేశాం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు. ఏ బీ వీ పీ. పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 27,000ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000ల స్కూళ్లను ఎత్తివేసి మూడు లేదా నాలుగు మండలాలకి కలిపి ఒకటే తెలంగాణ పబ్లిక్ స్కూల్ లేదా ఇంటిగ్రేటెడ్ పేరుతో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను



ఎత్తివేయాలనే ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న. ఎం ఈ ఓ, డి ఈ ఓ. పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దయనీయ స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఎన్ ఈ పి 2020 ని అమలు చేయాలని, ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్,యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం నగర సంయుక్త కార్యదర్శి గుండాల శివరామకృష్ణ, యలమల హేమ సుందర్ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ బబ్లు, భూషరాజు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాప్ పేరుతో యూరియాపై ఆంక్షలు.. రైతులపై కాంగ్రెస్ దౌర్జన్యం

**– దేవరకొండ మాజీశాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ: జూన్ 21 (సాక్ష్యం)**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను సక్రమంగా అమలు చేయడం లేదు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను కూడా సరిగా సరఫరా చేయడం లేదు. ఇప్పుడు యూరియా విషయంలో కూడా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే. రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.....రైతులకు రెండు బస్తాల యూరియానే ఇస్తామని, అదీ యాప్ ద్వా రా మాత్రమే అందిస్తామని కొత్త ఆంక్షలు విధించడంపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా సరఫరాలో రవాణా సమస్యలు తలెత్తినప్పుడు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా సంబంధిత జీఎంలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవారని ఆయన గుర్తు చేశారు.ఆనాడు వ్యవసాయ శాఖ మంత్రి, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తగిన చర్యలు తీసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేవారు.బీఆర్ఎస్ పాలించిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఒక్క సీజన్లో కూడా యూరియా కోసం గానీ, ఇతర ఎరువుల కోసం గానీ రైతులు ఇబ్బంది పడలేదని పేర్కొన్నారు. ఎరువుల కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎప్పుడూ రాలేదు. రైతులకు సకాలంలో ఎరువులు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి 75 సార్లు వెళ్లారని చెబుతు న్నారని, అయితే రైతుల అవసరాల కోసం కేంద్రాన్ని ఎందుకు ఒప్పించ లేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ వంటి అంశాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి భూములు తెచ్చుకునే సామర్థ్యం ఉన్నప్పుడు, రైతులకు అవసరమైన యూరియాను ఎందుకు సాధించలేకపోతున్నారని నిలదీశారు.తెలంగాణ రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందించాలి. గతంలో అమలైన విధంగానే యూరియా సరఫరా వ్యవస్థను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భారతీయ ఆధ్యాత్మిక సంపద యోగా: భాజపా అధ్యక్షుడు మారం రవి కుమార్
### – ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**పాలకుర్తి జూన్ 21(సాక్ష్యం):**
ఆదివారం రోజు భారతీయ జనతా పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షులు మారం రవి కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని తహసిల్దార్ ఆఫీస్ గ్రౌండ్ లో ప్రముఖ యోగా గురువు చిలుకమారి సోమేశ్వర్ చే అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా మండల అధ్యక్షులు మారం రవి కుమార్ మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక కళా యోగా నేడు విశ్వవ్యాప్తంగా మన్ననలు పొందడం మనందరికీ గర్వకారణం అని, శరీరాన్ని ఆరోగ్యంగా మనసును ప్రశాంతంగా ఉంచే శక్తివంతమైన సాధనమే యోగా అని,ప్రతి ఒక్కరు యోగా చేయాలని దీనితో మానసిక శారీరక ఉపశమనం పొందవచ్చునీసూచించారు. యోగా చేయడానికి చిన్న పెద్ద అనే వయసు తేడా లేదని ప్రతి ఒక్కరు తమ జీవితంలో దీని భాగం చేసుకోవాలనే ఉద్దేశ్యం తో వివేకానందుడు కలలు



కన్న ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, దృఢ సంకల్పం ఉన్న యువకుల వల్ల దేశం అభివృద్ధి సాధ్యమనే సంకల్ప దీక్షతో ప్రధాని నరేంద్ర మోడి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవము పకటించేందుకు కృషి చేసినందుకు వారికి సదా రుణ పడి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుంపల సంపత్ ,జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్, కడుదుల నిరంజన్, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్,ఉపాధ్యక్షులు పబ్బా సంతోష్, సీనియర్ నాయకులు మచ్చ సునీల్,వేమునూరి శ్రీనివాస్, పొలాస శ్రీనివాస్, భాను, రాపాకఉపేందర్, విద్యార్థులు, మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట సాక్షి న్యూస్..**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. గ్రామానికి చెందిన నక్క మహేష్ -- మధుశ్రీ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టుబట్టలు, యాట పొట్టేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కొత్త ఇంటిలో అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆయన ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వం నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. పేద





కుటుంబాలు అద్దె ఇళ్లలో, తాత్కాలిక గృహాల్లో ఇబ్బందులు పడకుండా శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అమలులో విశేష పురోగతి సాధించామని, రాష్ట్రవ్యాప్తంగా ఆలేరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, ప్రభుత్వ సంకల్పమే కారణమన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబం సొంత ఇంటిలో ఆనందంగా జీవించే రోజులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపురం గ్రామ సర్పంచ్ మంగ సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండ్లపల్లి మండలంలోని నాలుగు పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### మండల విద్యాధికారి నర్సింహా

**డిండి. సాక్ష్యం న్యూస్ :** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 4 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించుటకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున అట్టి పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు ఒక ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఒక ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీ పగిడిపాటి నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రింది పేర్కొనబడిన పాఠశాలల్లో మాత్రమే ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఒక ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

1. ప్రాథమిక పాఠశాల - టి గౌరారం
2. ప్రాథమిక పాఠశాల - కందుకూరు
3. ప్రాథమికోన్నత పాఠశాల - ఖానాపూర్
4. ప్రాథమికోన్నత పాఠశాల - ఎర్రారం

అర్హతాలు :
1) ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. బాల్య విద్య లేదా ప్రాథమిక విద్యా బోధనలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ తెలిపారు.
2) ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి.

**నోట్ :** అర్హత కు సంబంధించిన సర్టిఫికెట్స్ తప్పకుండ జత చేయవలెను.

**వయస్సు :**
అభ్యర్థుల వయస్సు నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎసి , ఎస్టీ , బీసీ , ఈ డబ్ల్యూ యస్ వాళ్లకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, మరియు అంగవైకల్యం ఉన్నవారికి 10 సంవత్సరాల వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

**గౌరవ వేతనం:**
1) ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ కు నెలకు 8000 చొప్పున 10 నెలలకు గౌరవ వేతనం చెల్లిస్తారు.
2) ఆయా పోస్టుకు నెలకు 6000 చొప్పున 10 నెలలకు గౌరవ వేతనం చెల్లిస్తారు.

దరఖాస్తులను మండల విద్యాధికారి కార్యాలయం - గుండ్లపల్లి నందు తేది: 22-06-2026 నుండి 26-06-2026 సాయంత్రం 4 గంటల వరకు సమర్పించవచ్చని తెలిపారు. ఎంపికలో స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి - గుండ్లపల్లి గారు కోరారు.



## తుర్కపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**తుర్కపల్లి సాక్షి న్యూస్.**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని బీల్యా నాయక్ తండ ,మాదాపురం ,రుస్తాపురం, రాంపురం, తిరుమలపురం, గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడే విధంగా మహిళా సంఘం భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకమని, వీరి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముల్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ యాట పొట్టేళ్లను అందజేసి ఆశీర్వదించారు.. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సాధికారత, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. మహిళా సంఘాల భవనాలు నిర్మాణం పూర్తయిన తర్వాత సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## రూ.40 లక్షల అనవసర రోడ్డు పనులను ఆపాలి

- గిరిజన నిధులను గిరిజనులకే వినియోగించాలి - సాంకేతిక అనుమతులపై సమగ్ర విచారణ జరపాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యాశారదకు ఫిర్యాదు - ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్

**రాయపర్తి, జూన్ 21(సాక్ష్యం):** రాయపర్తి మండలం సూర్యతండాలో అనవసర రోడ్డు పనులను వెంటనే నిలిపివేయాలని, గిరిజన నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు భూక్య సురేందర్ రాథోడ్ నాయక్ జిల్లా కలెక్టర్ సత్యా శారదకు ఫిర్యాదు చేశారు. గిరిజనుల నిధులతో గిరిజన ప్రధాన సమస్యలు తాగునీరు, డ్రైనేజీ లాంటివి వదిలేసి అనవసరపు రోడ్డు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయపర్తి మండలం సూర్యతండా గ్రామంలో గిరిజనుల అభివృద్ధి కోసం కేటాయించిన సుమారు రూ.40 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపించాలని వినతి పత్రం అందజేశారు. గ్రామంలో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్య సదుపాయాలు వంటి అత్యవసర మౌలిక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమయంలో గిరిజనులకు అవసరం లేని పనులపై గిరిజన నిధులను ఖర్చు చేయడం సమంజసం కాదని సురేందర్ రాథోడ్ పేర్కొన్నారు. కొనసాగుతున్న రోడ్డు పనులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ను ఆయన కోరారు. రోడ్డుకు కేటాయించిన నిధుల మంజూరు, సాంకేతిక అనుమతులు, వ్యయంపై సమగ్ర విచారణ జరపాలని సురేందర్ రాథోడ్ పేర్కొన్నారు. అవసరమైతే విజిలెన్స్ లేదా స్వతంత్ర కమిటీతో దర్యాప్తు నిర్వహించాలని ఆయన కోరారు. బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన నిధులను గిరిజనుల అభివృద్ధికే కేటాయించి వినియోగించాలని సురేందర్ రాథోడ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇస్లావత్ సంతోష్, గుగులోత్ రమేష్, లావుడ్యా నరేష్ తదితరులు పాల్గొన్నారు.







## 12వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి జూన్ 21 (సాక్ష్యం):**
భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావులి గారు ఈరోజు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఆయుష్ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ యోగా మానవ జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆరోగ్యకరమైన, ఉల్లాసమైన జీవితం గడపడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఉదయం యోగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య గారు, అడిషనల్ ఎస్పీ నరేష్ గారు,యోగ అభ్యాసకులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





## పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

**నాగర్ కర్నూల్: జూన్ 21 (సాక్ష్యం)**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పల్లవి మోడల్ స్కూల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శృతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం సాధ్యమవుతుందని వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను ఉత్సాహంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.






## సువర్ణ పుష్పార్చన, క్యూలైన్లలో పాల్గొన్న భక్తులు

**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..**
పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో అదివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆదివారం సెలవురోజు కావడంతోయాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే తమ కుటుంబ సభ్యులతో క్యూలైన్ల లో బారులు తీరిన భక్తులు..భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ మాడవీధులు, కళ్యాణకట్ట, పుష్కరిణి, వ్రత మండపం, వాహనాల పార్కింగ్, ఘాట్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ధర్మ దర్శనం. 3గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనం,గంట సమయం పడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. భక్తులు తమ కుటుంబీకులతో కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు. పలువురు తలనీలాలు సమర్పించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.





## ఆరోగ్యానికి యోగ - ఆనందానికి మార్గం

- రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకులంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగ ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తుంది - ప్రిన్సిపల్ ఎస్ సరిత

**రాయపర్తి, జూన్ 21(సాక్ష్యం):** ఆధునిక జీవితంలో సవాళ్లు, ఒత్తిళ్ల మధ్య యోగ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, క్రమశిక్షణ, సానుకూల శక్తిని ప్రసాదిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ ఎస్. సరిత అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపల్ ఎస్. సరిత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం, మానసిక ప్రశాంతతకు, ఆధ్యాత్మిక మార్గం చూపించే విధంగా యోగా ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనం, మానసిక ప్రశాంతతకు, లక్ష్య సాధనకు ఏకాగ్రతకు యోగ తోడ్పడుతుందని, విద్యార్థులు వారి లక్ష్యాలను సాధించడానికి, ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రిన్సిపల్ ఎస్. సరిత తెలిపారు. ఆధునిక ఒత్తిళ్లను జయించే శక్తి యోగాలో ఉందని, యోగాతో మానసికంగా, శారీరకంగా ఉల్లాసం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## వంగపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..**
వంగపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి వంగపల్లి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వగ్గు రవళి రాణాప్రతాప్, డీసీసీ జనరల్ సెక్రటరీ కానుగు బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేయడంతో పాటు, గ్రామానికి బస్సు సేవలు అందించడంలో భాగస్వాములైన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కానుగు రాజీవ్ గౌడ్, కళ్ళే వినోద్ కుమార్, చిన్నం మల్లేష్, గడ్డం ప్రకాష్, నాయకులు జోగు శంకర్, రేగు సిద్ధి రాములు, ఐలయ్య, వగ్గు ఉపేందర్, ఉప్పలయ్య, నరసింహా, నమిలే రవి, గడ్డం బాలయ్య, పురుషోత్తం, మస్తాన్, హరి శంకర్, ఆంజనేయులు తదితరులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, సాధారణ ప్రజల రవాణా అవసరాలు మరింత సులభతరం అవుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి వీరు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# యర్రగొండపాలెంలో పసుపు జెండా రెపరెపలు ఖాయం: ఎరిక్షన్ బాబు

- టీడీపీ విజయ దుందుభికి రంగం సిద్ధ
- ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు దూకుడుతో ముసుగు కోటరీ ఖాళీ – క్యాడర్ ఏకతాటిపైకి
- చంద్రబాబు పాలనే శ్రీరామరక్ష అంటున్న నియోజకవర్గ ప్రజానీకం





**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం** యర్రగొండపాలెం గడ్డ టీడీపీ అడ్డా అనే నినాదం మళ్లీ మార్మోగుతోంది.నియోజకవర్గ ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు రాకతో స్తబ్దుగా ఉన్న పసుపు దళంలో కొత్త ఊపు వచ్చింది. వర్గపోరు,ముసుగు రాజకీయాలకు చెక్ పెట్టి, అభివృద్ధి ఎజెండాతో ఎరిక్షన్ బాబు దూసుకుపోతుండటంతో ఈసారి యర్రగొండపాలెంలో టీడీపీ గెలుపు లాంఛనమేనని రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు.

**లెక్కలతో సహా టీడీపీదే పైచేయి..**
2019,2024 ఎన్నికల్లో ఓటమికి కారణం ప్రజా వ్యతిరేకత కాదు,మన ఇంటి దొంగలే అని టీడీపీ శ్రేణులు తేల్చి చెబుతున్నాయి.

బూత్ లెవెల్ డేటా : గత ఎన్నికల్లో 37 బూత్‌లలో 200 ఓట్ల లోపు తేడాతోనే టీడీపీ ఓడింది.ఆ 37 బూత్‌లలో 21 బూత్‌లు టీడీపీ సానుభూతిపరుల గ్రామాలే.కారణం ముసుగు నాయకుల మ్యాచ్ ఫిక్సింగ్.

క్యాడర్ బలం : నియోజకవర్గంలో సుమారుగా 18,500 మంది క్రియాశీల టీడీపీ కార్యకర్తలున్నారు.వీరిలో 60% మంది యువత.ఎరిక్షన్ బాబు వచ్చాక గత 2 నెలల్లో 3,200 మంది నూతన సభ్యత్వాలు తీసుకున్నారు.

సర్వే రిపోర్ట్ : అంతర్గత సర్వే ప్రకారం చంద్రబాబు సూపర్-6 పథకాలకు యర్రగొండపాలెంలో 72% మంది మహిళలు జై కొడుతున్నారు.తల్లికి వందనం,ఆడబిడ్డ నిధి పై ప్రజల్లో భారీ ఆశలు ఉన్నాయి.


**ముసుగు వీరుల పని ఖతం – అధిష్ఠానం సీరియస్..**
వ్యాపారాల కోసం పార్టీని తాకట్టు పెట్టిన వారి పని ఇక ఖతం అని ఎరిక్షన్ బాబు హెచ్చరించారు.పైన చంద్రబాబు రావలంటా..? యర్రగొండపాలెంలో వద్దంటా..? అనే ద్వంద్వ వైఖరి ఇక చెల్లదు.అధిష్ఠానం దగ్గర మొత్తం లిస్ట్ ఉంది.టీడీపీ ముసుగులో వైసీపీతో కుమ్మక్కైన వారిని,కోవర్టు ఆపరేషన్ చేసిన వారిని రెండేళ్ల క్రితమే గుర్తించాం.వారికి పార్టీలో స్థానం లేదు అని ఆయన తేల్చి చెప్పారు.దీంతో నిస్వార్థ కార్యకర్తల్లో కొత్త ధైర్యం వచ్చింది.15 ఏళ్లుగా పార్టీ జెండా మోస్తున్న సీనియర్లు సైతం ఇప్పుడు ఫీల్డ్‌లోకి వచ్చేశారు.

**అభివృద్ధి బాటలో ఎరిక్షన్ బాబు – ప్రత్యర్థులకు దిమ్మతిరిగే ప్లాన్..**
టీడీపీ అంటేనే అభివృద్ధి.ఆ బ్రాండ్‌ను తిరిగి తెచ్చేలా ఎరిక్షన్ బాబు యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు.
యర్రగొండపాలెం టౌన్ ట్రాఫిక్,డ్రైనేజీ, తాగునీరు
100 కోట్లతో స్మార్ట్ యర్రగొండపాలెం తో సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు,పార్క్.
పెద్దారవీడు మండలంలో సాగునీటి సమస్య
గుండ్లకమ్మ లిఫ్ట్ పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరు.ప్రతి చెరువులో పూడికతీత. త్రిపురాంతకం మండలంలో అటవీ గ్రామాలకు రోడ్లు లేవు నల్లమల అటవీ బోర్డర్ గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు.గిరిజనులకు పోడు పట్టాలు.
దోర్నాల మండలంలో వైద్యం అందక చెంచులు ఇబ్బంది ప్రతి చెంచు పెంటకు మొబైల్ హెల్త్ క్లినిక్.శ్రీశైలం యాత్రికుల కోసం 50 పడకల ఆసుపత్రి. పుల్లలచెరువు మండలంలో యువతకు ఉపాధి లేదు మార్కాపురం-యర్రగొండపాలెం కారిడార్‌లో మినీ ఇండస్ట్రియల్ పార్క్,స్కిల్ సెంటర్.

**ఇక విజయం మనదే – కారణాలు ఇవే**
**ఐక్యత :** ఎరిక్షన్ బాబు వల్ల అన్ని వర్గాలు, అన్ని సామాజిక కులాలు టీడీపీ గొడుగు కిందకు వచ్చాయి. మాదిగ, మాల, యాదవ, గౌడ,కమ్మ,రెడ్డి,బలిజ కార్యకర్తలు భుజం భుజం కలిపారు.
**వ్యతిరేకత :** వైసీపీ 5 ఏళ్ల పాలనలో రోడ్లు లేవు,నీళ్లు లేవు,ఉద్యోగాలు లేవు.జగన్ రెడ్డి గ్రాఫ్ అట్టడుగుకు పడిపోయింది.జనం మార్పు కోరుకుంటున్నారు.
**చంద్రబాబు బ్రాండ్ :** బాబు వస్తే జాబు వస్తుంది అని యువత,"బాబు వస్తే సంక్షేమం" అని మహిళలు నమ్ముతున్నారు.ఆ నమ్మకమే టీడీపీ బలం.
**లోకేష్ యువగళం ఎఫెక్ట్ :** యర్రగొండపాలెం మీదుగా సాగిన యువగళం పాదయాత్ర యువతలో తుఫాన్ లేపింది.ఆ 12,000 మంది యువత ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియా వారియర్స్.
**విశ్వసనీయ వర్గాల సమాచారం :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యర్రగొండపాలెంను టీడీపీ " క్లీన్ స్వీప్ " నియోజకవర్గాల లిస్టులో చేర్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు స్వయంగా 2 సార్లు ఇక్కడ ప్రచారం చేసే అవకాశం ఉంది.కాలం మారుతుంది.ముసుగు వీరులు మారినా మారకపోయినా యర్రగొండపాలెంలో పసుపు జెండా ఎగరడం ఖాయం.ఇది చరిత్ర చెప్పిన సత్యం.ఇది ప్రజల తీర్పు అని ఎరిక్షన్ బాబు సభాముఖంగా ప్రకటించారు.యర్రగొండపాలెం నియోజకవర్గంలో నిస్వార్థమైనా సీనియర్ నాయకుల అభిప్రాయంతో విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మాత్రమే...

## పశువుల సంరక్షణలో టీకా ఒక్కటే మార్గం

### పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్



**ఖానాపురం జూన్ 21 (సాక్ష్యం న్యూస్ ):** పశువుల ఆరోగ్యాన్ని కాపాడటంలో టీకాలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని,గాలికుంటు, గొంతువాపు, జబ్బువాపు, బ్రుసెలోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవడానికి టీకా ఒక్కటే మార్గమని ఖానాపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణకు గాను టీకాలు వేయడం ద్వారా అంటువ్యాధులు ఒక పశువు నుంచి మరొక పశువుకు సోకకుండా అడ్డుకోవచ్చు. దీనినే 'మంద రోగనిరోధక శక్తి' అంటారు. వ్యాధి వచ్చిన తర్వాత పశువైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టే కంటే, ముందుగానే టీకాలు వేయించడం చాలా తక్కువ ఖర్చుతో కూడుకుంటుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న పశువులే అధిక పాల దిగుబడిని ఇస్తాయి మరియు సంతానోత్పత్తి సమస్యలు లేకుండా సమర్థవంతంగా పనిచేస్తాయి. దీనివల్ల రైతుకు నేరుగా ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పశువైద్య శాఖ జారీ చేసిన టీకాల షెడ్యూల్ పక్కాగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న పశువులకే టీకాలు వేయాలి. టీకా వేయించుకున్న వివరాలను ఒక రికార్డులో నమోదు చేసుకోవడం మర్చిపోవద్దు. టీకా వేయించిన సమయం నుంచి కొన్ని రోజుల పాటు పశువులకు తగినంత పోషకాహారం, స్వచ్ఛమైన నీరు అందించి, వాటికి విశ్రాంతినివ్వాలన్నారు. గుర్తుంచుకోండి.. 'టీకా వేయండి -- వ్యాధులను అరికట్టండి -- పశువుల ఆరోగ్యాన్ని కాపాడండి -- తద్వారా రైతు ఆదాయాన్ని పెంచుకోండి'. మరిన్ని వివరాలకు మీ సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని వివరించారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు: ఆలకుంట హరి



**సికింద్రాబాద్, జూన్ 21(సాక్ష్యం) :** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణాదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆలకుంట హరి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు ఆలకుంట హరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గం, ఆయన ఆశయాలు, త్యాగస్ఫూర్తి నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడిగా ప్రొఫెసర్ జయశంకర్ చిరస్మరణీయులని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మామూళ్ల మత్తులో ఆర్మూర్ అబ్కారీ శాఖ




**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ జూన్ 21:** ఆర్మూర్ ఆబ్కారి శాఖ మామూళ్ల మత్తులో తగుతుంది. ఆర్మూర్ పట్టణంతో పాటు సర్కిల్ పరిధిలోని పలు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులో నడుస్తున్నాయి. అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నప్పటికీ ఆబ్కారి శాఖ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుంది. ఆర్మూర్ పట్టణంలోని కింది బజార్, జురాయిత్ నగర్ వెళ్లే రోడ్డుతో పాటు మామిడిపల్లి, పెరికిట్లలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులలో మద్యం అర్ధరాత్రి వరకు విక్రయిస్తున్నారు. కింది బజార్ సమీపంలో కిరాణా దుకాణాలలో ఉప్పు,పప్పు తో సమానంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు పట్టణంలో గంజాయి విక్రయాలు కూడా జోరుగా సాగుతున్న ఏనాడు కూడా ఒక కేసు కూడా నమోదు చేసిన దాఖలాలు లేవు. సాయంత్రం ఏడు దాటిందంటే యువత గంజాయి మత్తులో పువ్వుతున్నారు. గల్లీ గల్లీలో యువత అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ గల్లీలలో గలాటా సృష్టిస్తున్న ఆబ్కారి శాఖ ఈనాడు తనిఖీలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉంది. ఇదిలా ఉంటే ఆర్మూర్ సర్కిల్ పరిధిలోని సుమారు 25 మద్యం షాపుల నుండి సరాసరి నెల నెల 25 వేల నుండి 30 వేల వరకు నజరాణాలు అందుతున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల నుండే కాకుండా బెల్ట్ షాపుల నుండి సుమారు 2000 నుండి 5000 వరకు నెలనెలా మామూలు అందుతున్నట్లు తెలిసింది. ఈ నజరానాలను స్థాయికి తగ్గట్లుగా సీఐ నుండి కానిస్టేబుల్ వరకు పంపిణీ జరుగుతున్నట్లు సమాచారం. ఇంత భారీ స్థాయిలో ముడుపులను తీసుకుంటున్న అధికారులు అక్రమ మద్యం దారులపై ఎలాంటి చర్యలు చేపడతారు ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. పోలీస్ శాఖ వారు మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారే తప్ప, ఆబ్కారి శాఖ ఏనాడు కూడా కేసులను నమోదు చేసినట్లు చూపడం లేదు. నిత్యం యువత గంజాయి, మద్యం మత్తులో పట్టణంలో అర్ధరాత్రి వరకు గలాటాలు సృష్టిస్తున్నారు. ఒకప్పుడు పట్టణంలోని టీచర్స్ కాలనీలో అద్దె భవనంలో అబ్కారీ శాఖ కార్యాలయం కొనసాగుతూ ఉండేది, కానీ పట్టణానికి దూరంగా ప్రభుత్వం అబ్కారీ శాఖకు సొంతభవనాన్ని నిర్వహించగా ఏదైనా పని నిమిత్తం ఆబ్కారి శాఖ కార్యాలయానికి వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది. దీనికి తోడు ఏదైనా విచారణ నిమిత్తం అధికారులకు ప్రజలకు వారధిగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారులకు సెల్ ఫోన్ లను అందించగా ఆ సెల్ ఫోన్ లకు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించకపోవడం తో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. అవసరం ఉంటేనే లేదా ఏదైనా ఫిర్యాదు నిమిత్తం ఫోన్ చేస్తే సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫోన్ లేపడం మహాభాగ్యంగా తయారయింది. ఇప్పటికైనా ఆబ్కారి శాఖ కొంత మేల్కొని పనిచేస్తే బావుంటుందని ప్రజలు కోరుతున్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి



**సికింద్రాబాద్, జూన్ 21(సాక్ష్యం)..**లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం వద్ద తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్లి నాగరాజు గౌడ్ పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, కృష్ణస్వామి, రాజలింగం, వంజరి వెంకటేష్, గిరి, డెంజిల్, పరశురామ్, రాజు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నగరంలో ఘనంగా 'సంధ్యా రవళి - 2026' శాస్త్రీయ నృత్యోత్సవం

### 130 మందికిపైగా కళాకారుల ప్రదర్శనలు.. ఆకట్టుకున్న 35 నృత్య రూపాలు



**సికింద్రాబాద్, జూన్ 21 (సాక్ష్యం):** భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల పరిరక్షణ, యువతలో కళల పట్ల ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో అనంత ఆనంద ట్రస్ట్, సరళ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంధ్యా రవళి--2026' శాస్త్రీయ నృత్యోత్సవం నగరంలో వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది అనంతపురంలో నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించడం విశేషం. కూచిపూడి, భరతనాట్యం, కథక్, జానపద నృత్యాలతో పాటు పలు భారతీయ శాస్త్రీయ నృత్య కళారూపాలకు చెందిన 130 మందికిపైగా కళాకారులు పాల్గొని 35 అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భారత మాజీ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి ముఖ్య అతిథిగా హాజరుకాగా, తెలంగాణ బీజేపీ రాష్ట్ర మండలి సభ్యులు రొయ్యూరు శేషసాయి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. దక్షిణాత్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకురాలు డాక్టర్ అనితా రావు, ప్రముఖ కూచిపూడి నర్తకులు మృత్యుంజయ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై భారతీయ నృత్య కళల పరిరక్షణలో యువత పాత్రను వివరించారు.1979లో అనంతపురంలో శ్రీమతి జి. సంధ్యామూర్తి ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన 'శ్రీ నృత్య కళా నిలయం' సంస్థ ఇప్పటివరకు సుమారు 30 వేల మంది విద్యార్థులకు నృత్య శిక్షణ అందించింది. ప్రస్తుతం దాదాపు 200 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన జి. సంధ్యామూర్తి నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన నృత్య బోధన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. తన శిష్యులు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు నృత్య విద్యను అందిస్తున్నారని తెలిపారు. భారతీయ సంప్రదాయ కళలను భావితరాలకు చేరవేయడం ప్రతి కళాకారుడి బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కళలు, ప్రదర్శనా నైపుణ్యాలు, జీవన నైపుణ్యాల బోధనలో సేవలందిస్తున్న అనంత ఆనంద ట్రస్ట్, సరళ్ ఇండియా సంస్థలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాయి. సంధ్యామూర్తి కుమార్తె అనురాధ మూర్తి సహకారంతో కార్యక్రమం సజావుగా సాగింది.కార్యక్రమ నిర్వహణలో అనంత ఆనంద ట్రస్ట్ వ్యవస్థాపకుడు విశాల్ రావల్, సరళ్ ఇండియా వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ పూజా సభావత్, బిజినెస్ హెడ్ ప్రయాగ్ సి కీలక పాత్ర పోషించారు.భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల పరిరక్షణతో పాటు యువతలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.




## త్రైత సిద్ధాంత భగవద్గీత ద్వారానే ధర్మాలపై అవగాహన



**కోదాడ జూన్ 21,( సాక్ష్యం)** త్రైత సిద్ధాంత భగవద్గీత ద్వారానే ధర్మాలపై అవగాహన ఏర్పడుతుందని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కోదాడ శాఖ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో త్రైత సిద్ధాంత గ్రంథాల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత జ్ఞానం బోధించి 5150 సంవత్సరాలు దాటినా అందులోని రహస్య జ్ఞానం ఇప్పటి వరకూ ఎవరికీ అర్థం కాలేదన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమే శ్రీకృష్ణుడి నిజభావాన్ని బహిర్గతం చేసిందన్నారు. కొంతమందికి బాధ కలిగించినప్పటికీ ఇప్పటి స్వామీజీలకు ధర్మం అంటే ఏమిటో, అసలు ధర్మాలు ఎన్ని ఉన్నాయో కూడా తెలియవన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ద్వారా ధర్మం అంటే నాశనం అని, జీవుడు చావు, పుట్టుకలు లేకుండా దేవుడిలో కలిసిపోయేందుకు ఉపయోగపడేదే ధర్మం అని, ధర్మాలు రెండు మాత్రమే ఉన్నాయని, కర్మ యోగం, బ్రహ్మ యోగం ఈ రెండు ధర్మాల గురించి శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో బోధించిన రహస్య జ్ఞానాన్ని త్రైత సిద్ధాంత భగవద్గీత స్పష్టంగా అర్థమయ్యేలా చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత గ్రంథాలు చదవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారంలో ముత్తవరపు శైలజ, సైదా, వంగాల మహేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

### మాడుగులపల్లి మండల సర్పంచుల
## ఫోరం అధ్యక్షుడిగా వడ్డే సైదిరెడ్డి ఎన్నిక






**మాడుగులపల్లి జూన్ 21 సాక్ష్యం;** రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఆదేశానుసారంగా ఆదివారం మాడుగులపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా చెరువుపల్లి గ్రామ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక సందర్భంగా మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచుల సమస్యలను సమన్వయంతో పరిష్కరించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని వడ్డే సైదిరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి, సాగర్ శాసనసభ్యులు జైవీర్ రెడ్డి ల సహకారంతో అన్ని గ్రామాల అభివృద్ధికై నిధులు తెచ్చి అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో వడ్డే సైదిరెడ్డి నాయకత్వం సర్పంచులకు మరింత బలం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,మండల అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, సిద్ధార్థ రెడ్డి,నరసింహ, సైదిరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

## స్వయం ఉపాధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**– ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్**

**– ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం**



**చౌటుప్పల్ జూన్ 21( సాక్ష్యం)** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్'ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు ఫౌండేషన్ సభ్యులు రక్త పరీక్షలు చేయించుకున్నారు. ప్రారంభోత్సవ కానుకగా 20,000 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ముందస్తు ఆరోగ్య పరీక్షలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని తోటి వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందాలని సూచించారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

## విద్యాభ్యాసానికి చెదిరిన గూడు

**– గొత్తికోయ గూడెం విద్యార్థుల గోస**



**ఏటూరునాగారం, జూన్ 21, (సాక్ష్యం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య పై ప్రత్యేక చొరవ తీసుకుని కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని పట్టణాల్లో ప్రారంభోత్సవాలు చేసి గొప్పలు చెప్పుకోవడం కాదు. ములుగు ఏజెన్సీ ఏటూరునాగారం మండలంలో గత రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి కొమురం భీం నగర్ గొత్తికోయ గూడెంలోని పాఠశాల పై కప్పు ఎగిరిపోయింది. ఈ విషయం అధికారులకు తెలియపరిచినప్పటికిని పట్టించుకోవడం లేదని గూడెం వాసులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఐతే రెండు రోజులుగా పై కప్పు ఈదురు గాలికి ఎగిపోయిందన్న విషయం పై అధికారులు స్పందిస్తారని చూసిన గూడెం వాసులు పట్టింపులేదనే కారణంతో అధికారుల పని తీరు పై



మండిపడుతున్నారు. రెండు రోజులుగా గూడెంలోని గొత్తికోయ విద్యార్థులు పై కప్పు లేని పాఠశాలలో చదువును అభ్యసించడం పై విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చెన్నారు. దీంతో గొత్తికోయ విద్యార్థులు చదువుకునేందుకు ఇంబందులు ఎదుర్కొంటున్నారు. విద్య వ్యవస్థలో మార్పులు తీసుకువస్తామని పట్టణాల్లో పాఠశాలల ప్రారంబోత్సవాలు చేస్తే కాదు, పల్లెలో, గూడాలలో పాఠశాలల పరిస్థితుల పై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతూ అధికారులు తక్షణమే తమ పాఠశాల పరిస్థితి పై చర్యలు తీసుకుని పై కప్పు నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గూడెం వాసులు కోరుచున్నారు.

## వర్ధన్నపేట భవాని కుంట వద్ద రోడ్డు ప్రమాదం

**ఆటోను ఢీకొట్టిన బైక్ వృద్ధుడికి తీవ్ర గాయాలు – 108 సిబ్బంది సకాలంలో స్పందన**




**వర్ధన్నపేట, జూన్ 21(సాక్ష్యం):** పట్టణంలోని భవాని కుంట సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్యాసింజర్ ఆటోను వెనుక నుండి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న మామిడాల నర్సయ్య 70 అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ వేణు క్షతగాత్రునికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం

**– విద్యార్థులతో కలిసి ఆసనాలు వేసిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి**




**వర్ధన్నపేట, జూన్ 21(సాక్ష్యం):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి యోగా ఆసనాలు నిర్వహించిన చైర్మన్, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఉదయం అల్పాహార టిఫిన్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇటీవల ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో 3 సీట్లు సాధించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థ నాణ్యతకు నిదర్శనమని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కృషి చేసి మరిన్ని విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సహకారంతో పాఠశాల భవనాల మరమ్మతులు, విద్యుత్ సరఫరా మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర పనులు త్వరలో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్, కౌన్సిలర్ బెజ్జం పాపరావు, ఉపాధ్యాయులు ఎన్ సిసి మణిజేందర్ రెడ్డి, బి. దేవయ్య, పిఈటి జి. కుమారస్వామి, పి. వెంకన్న, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో నీట్-2026 పరీక్ష ప్రశాంతంగా ముగింపు

**– 4,291 మందిలో 3,862 మంది హాజరు**

**– పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్‌నగర్, జూన్ 21 ( సాక్ష్యం బ్యూరో )** మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ యుజి--2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించబడినట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణను కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియ, ద్విస్థాయి భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్



ధృవీకరణ, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టింది. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల పరీక్ష విజయవంతంగా పూర్తయిందన్నారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,291 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు చేసుకోగా, 3,862 మంది హాజరయ్యారు. 429 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### దివిస్ పరిశ్రమలో ఘనంగా
## అంతర్జాతీయ యోగా దినోత్సవం





**చౌటుప్పల్ జూన్ 21 (సాక్ష్యం)** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దివిస్ పరిశ్రమలో యోగా గురువు పాలకూర్ల పాండు ఆధ్వర్యంలో పరిశ్రమ ఉద్యోగులందరూ యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పరిశ్రమలో పనిచేయడం వలన ఆరోగ్యంగా ఉండటం కొరకు ప్రతిరోజు ఉదయం 10 నిమిషాలు యోగ చేయాలని తెలిపారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్ మురళీకృష్ణ, నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ జనరల్ ప్రొడక్షన్ డి శ్రీనివాస్, డి జి ఎం శివప్రసాద్, ఏజీఎం రావు, సీనియర్ మేనేజర్ ప్రొడక్షన్ ఏ శ్రీధర్ రావు, కిషోర్, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో జీవీ హాస్పిటల్ ప్రారంభం

**ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**

**కోదాడ జూన్21,(సాక్ష్యం)** పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జీ వీ హాస్పిటల్‌ను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో హెల్త్ చెకప్ చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు సంపాదించాలని వైద్యులు, యాజమాన్యానికి సూచించారు. పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా సేవలు అందించాలని ఆకాంక్షించారు. జీ వీ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్‌పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు, కారింగుల అంజన్ గౌడ్, అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, డాక్టర్ సుబ్బారావు, కాంగ్రెస్ మహిళా నాయకులు, కోదాడ పట్టణంలోని వివిధ ఆస్పత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



**కోదాడ జూన్ 21, (సాక్ష్యం)** ఫాదర్స్ డే సందర్భంగా మియాపూర్ హైద్రాబాద్ లోని తన కుమారుడు సాయిరాం గృహంలో :సాయిరాం,కుమార్తె చి:నాగ సంయుక్తరాణి ల సమక్షం లో ఫ్రూట్ కటింగ్ చేసిన యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో, వాసవి క్లబ్స్ జోన్ చైర్మన్, పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు సేకు శ్రీనివాసరావు ఆదివారం ఒకరికొకరు స్వీట్స్ అందించుకొని, ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అని యస్ యస్ రావు అన్నారు. తల్లిదండ్రులను, సంప్రదాయాలను మర్చిపోతున్న నేటి తరం లో తన పిల్లలు ఇలాంటి వేడుక నిర్వహించినందుకు వారిని అభినందించి,ఆశీస్సులు అందజేశారు. అదే విధంగా తన కోడలు చి: రమ్యా కు కూడా శుభాశీస్సులు అందించారు.



# ముక్కోణపు సిరీస్ విజేతగా భారత్..

దంబుల్లా వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఏ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. పరుగుల వరద పారించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక ఏ జట్టును 66 పరుగుల తేడాతో ఓడించి భారత్ ట్రోఫీని ముద్దాడింది.

గ్రూప్ దశలో లంక 6 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా.. భారత్ 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరగా.. ఆఫ్ఘనిస్తాన్ ఏ జట్టు 2 పాయింట్లతో టోర్నీ నుంచి ముందే నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఇరు జట్లు తలపడటం ఇది మూడోసారి కాగా.. ఫైనల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకుంది. విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. లంక బౌలర్ మహ్మద్ షిరాజ్ వేసిన 3వ ఓవర్లోనే 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 26 పరుగులు రాబట్టిన వైభవ్ సూర్యవంశీ.. కేవలం 11 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసి లిస్ట్–ఏ క్రికెట్ హిస్టరీలోనే వరల్డ్ రికార్డు సృష్టించాడు. 29 బంతుల్లో 94 పరుగులు చేసి లంక కెప్టెన్ సహన్ అరాచిగే బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ ఔటయ్యాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(39) పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఓపెనర్లు ఇచ్చిన భారీ పునాదితో కెప్టెన్ తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ కలిసి మూడో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రుతురాజ్ గైక్వాడ్ 40 పరుగుల వద్ద ఔట్ కాగా.. తిలక్ వర్మ బాధ్యతాయుతంగా ఆడుతూ 90 బంతుల్లో 67 పరుగులు(4 ఫోర్లు, ఒక సిక్స్) చేశాడు. అనంతరం కుమార్ కుశాగ్ర 36 పరుగులు, విప్రజ్ నిగమ్ 27 పరుగులు చేయగా.. చివర్లో అనుకుల్ రాయ్ కేవలం 15 బంతుల్లోనే 39 పరుగులతో మెరుపులు మెరిపించాడు. దీంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బౌలర్లలో మథులన్, వన్యుజ సహన్, రవిందు ఫెర్నాండో రెండేసి వికెట్లు పడగొట్టారు.

378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఏ జట్టుకు ప్రారంభంలోనే గట్టి షాకులు తగిలాయి. భారత పేసర్ యశ్ ఠాకూర్ పవర్‌ప్లేలోనే నిరోషన్ డిక్వెల్లా(25), అవిష్క ఫెర్నాండో(3), నువానిందు ఫెర్నాండో(21) వికెట్లను పడగొట్టి లంకను కోలుకోలేని దెబ్బతీశాడు ఆ తర్వాత సదీర సమరవిక్రమ (52), కెప్టెన్ సహన్ అరాచిగే (38) నాలుగో వికెట్‌కు 53 పరుగులు జోడించి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. సహన్ అవుటయ్యే సమయానికి లంక 177 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఆ దశలో వన్యుజ సహన్ (62), విజయకాంత్ వ్యాసకాంత్ (39) ఏడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో భారత బౌలర్లను కాసేపు ప్రతిఘటించారు. అయితే వన్యుజ సహన్ ఔట్ కావడంతో లంక ఆశలు అడుగంటాయి. ఆఖర్లో దులాజ్ సముదిత (15), మహ్మద్ షిరాజ్ (21) ఔట్ కావడంతో శ్రీలంక 311 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్, విప్రజ్ నిగమ్ చెరో 3 వికెట్లతో అదరగొట్టగా.. అనుకుల్ రాయ్ 2 వికెట్లు, తిలక్ వర్మ, అశోక్ శర్మ చెరో వికెట్ సాధించి భారత్‌కు 66 పరుగుల ఘన విజయాన్ని అందించారు.

# పక్కా ప్లానింగ్‌తో బరిలోకి దిగాం

## భారత కెప్టెన్ తిలక్ వర్మ

ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో శ్రీలంక ఏ జట్టుపై ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్న అనంతరం భారత కెప్టెన్ తిలక్ వర్మ జట్టు ప్రదర్శనపై ప్రశంసలు కురిపించాడు. ప్రజెంటేషన్ వేడుకలో మాట్లాడిన తిలక్ వర్మ.. టోర్నీలో తమ ప్రయాణం అంత సులభంగా



సాగలేదని గుర్తు చేసుకున్నాడు. ముఖ్యంగా గ్రూప్ దశలో ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక చేతుల్లో వరుసగా ఓడిపోయిన తర్వాత జట్టులోని ఆటగాళ్లంతా అద్భుతంగా రాణించారని చెప్పుకొచ్చాడు. ఆ పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకుని భారీ తేడాతో మ్యాచ్‌లు గెలిచి ఫైనల్ చేరడం నిజంగా అద్భుతమని కొనియాడాడు. ఈ టోర్నీలో భారత్ అదరగొట్టడానికి గల సీక్రెట్ ఏంటని ప్రశ్నించగా.. తిలక్ వర్మ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. “మా జట్టులోని ఆటగాళ్లందరికీ దేశవాళీ క్రికెట్ ఆడిన మంచి అనుభవం ఉంది. మ్యాచ్‌కు ముందే మేము పక్కా ప్లానింగ్‌తో బరిలోకి దిగాం. పవర్‌ప్లేలో ఎలా ఆడాలి..10 నుంచి 40 ఓవర్ల మధ్య ఇన్నింగ్స్ ను ఎలా నిర్మించాలి, ఆ తర్వాత స్కోరును ఎలా వేగవంతం చేయాలనే దానిపై స్పష్టత ఉంది. డెత్ ఓవర్లలో మాకు మంచి హిట్టర్లు ఉన్నారనే నమ్మకం మాకు ఉంది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య ఇచ్చిన అద్భుతమైన ఆరంభం తర్వాత.. మిడిల్ ఓవర్లలో భాగస్వామ్యాలు నెలకొల్పడమే మా వ్యూహం. అదే ఈ రోజు వర్కవుట్ అయింది” అని కెప్టెన్ తిలక్ వర్మ వివరించాడు. ఈ సిరీస్ ద్వారా జట్టుగా ఏం నేర్చుకున్నారనే విషయంపై తిలక్ వర్మ కాస్త నిజాయితీగా స్పందించాడు. బ్యాటింగ్ విభాగం అంచనాలకు తగ్గట్టుగా రాణించినప్పటికీ.. బౌలింగ్ ప్రదర్శనపై తిలక్ వర్మ కొంత నిరాశను వ్యక్తం చేశాడు. “నిజం చెప్పాలంటే మాకు మంచి బౌలింగ్ అటాక్ ఉంది. కానీ ఈ టోర్నీలో మా బౌలింగ్ అనుకున్నంత స్థాయిలో లేదు. ఇలాంటి వన్–ఆఫ్ సిరీస్‌లలో కొన్నిసార్లు అలా జరుగుతుంటుంది. అందరికీ మంచి ప్రతిభ ఉంది కాబట్టి చివరికి ఫలితం మనకు అనుకూలంగా రావడం సంతోషమే. అయితే మేము గెలిచినా కూడా బౌలింగ్ విభాగంలో ఇంకా మెరుగుపరుచుకోవాల్సింది, నేర్చుకోవాల్సింది చాలా ఉంది” అంటూ తిలక్ వర్మ పేర్కొన్నాడు.

# అవకాశాలను చేజార్చుకోవడం వల్లే ఓటమి

## టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

మహిళల టీ20 వరల్డ్ కప్ 2026 లీగ్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయంపై టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్పందించింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్.. లభించిన అవకాశాలను చేజార్చుకోవడం వల్లే మ్యాచ్ ఓడిపోవాల్సి వచ్చిందని నిజాయితీగా ఒప్పుకుంది. “మ్యాచ్ మధ్యలో మాకు కొన్ని మంచి అవకాశాలు వచ్చాయి. కానీ దురదృష్టవశాత్తూ మేము వాటిని అందుకోలేకపోయాం. అయితే టోర్నమెంట్‌లో మాకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ సమయంలో మేము పాజిటివ్‌గా ఉంటూ.. రాబోయే మ్యాచ్‌లపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం” అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. దక్షిణాఫ్రికా జట్టును విజయతీరాలకు చేర్చిన మారిజాన్ కాప్ ఇన్నింగ్స్‌ను హర్మన్‌ప్రీత్ ప్రశంసించింది. అయితే ఆమె ఇచ్చిన రెండు కీలక క్యాచ్‌లను భారత ఫీల్డర్లు వదిలేశారని గుర్తు చేసింది. “ఈరోజు కాప్ అద్భుతంగా ఆడి మ్యాచ్‌ను మా నుంచి లాగేసుకుంది. అయితే ఆమె బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మాకు రెండు కీలక ఛాన్సులు లభించాయి. ఈ స్థాయి క్రికెట్‌లో లభించిన అవకాశాలను వదిలేస్తే ఎవరూ మనకు విజయాన్ని ఊరికే ఇవ్వరు. సరిగ్గా అదే మ్యాచ్‌ను మలుపు



తిప్పింది” అని చెప్పింది. అలాగే బౌలింగ్ విభాగం గురించి మాట్లాడుతూ.. పిచ్‌పై బంతి కాస్త టర్న్ అవుతున్న సమయంలో శ్రీ చరణి, షఫాలీ వర్మలు అద్భుతంగా బౌలింగ్ చేసి లంక బ్యాటర్లకు సవాల్ విసిరారని, కానీ మిగతా బౌలర్ల నుంచి వారికి ఆశించిన స్థాయిలో సపోర్ట్ లభించలేదని కెప్టెన్ అభిప్రాయపడింది. ఇలాంటి పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేయాలో మిగతా స్పిన్నర్లు కూడా ఆలోచించుకోవాలంది. తన కెరీర్‌లో 200వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ మైల్‌స్టోన్‌ను అందుకోవడంపై, మహిళల క్రికెట్ వృద్ధిపై హర్మన్‌ప్రీత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. “నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఎన్నో సానుకూల క్షణాలతో పాటు, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బలంగా ఎలా నిలబడాలి, సానుకూల దృక్పథంతో ఆట గురించి ఎలా ఆలోచించాలనేది క్రికెట్ నాకు నేర్పింది. ఒక కెప్టెన్‌గా ఇప్పుడు నా జట్టు సభ్యులతో మాట్లాడి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన సమయం ఇది. రాబోయే తదుపరి మ్యాచ్‌కు ఇంకా రెండు మూడు రోజుల సమయం ఉంది. మేము అందరం కలిసి కూర్చొని ఎక్కడ లోపాలు జరిగాయో సమీక్షించుకుంటాం. దానికి తగ్గట్టుగా తదుపరి మ్యాచ్‌కు అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేస్తాం. రాబోయే రెండు మ్యాచ్‌ల్లో ఒక జట్టుగా మేము బలంగా పుంజుకుంటామనే నమ్మకం నాకు ఉంది” అని హర్మన్‌ప్రీత్ కౌర్ ఆశాభావం వ్యక్తం చేసింది.



# దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓటమి

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీలో భారత మహిళా జట్టు అజేయ రథానికి బ్రేక్ పడింది. మాంచెస్టర్‌లోని ప్రతిష్టాత్మక ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగిన 18వ లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు చేతిలో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.

ఈ టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి జోరుమీదున్న భారత జట్టుకు ఇది మొదటి ఓటమి



కాగా, దక్షిణాఫ్రికా జట్టుకు ఇది వరుసగా రెండో విజయం కావడం విశేషం. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌తో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన కెరీర్‌లో 200వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ మైల్‌స్టోన్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ ప్రారంభంలోనే భారత టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. దీంతో టీమిండియా పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి కాస్త ఒత్తిడిలో పడింది. తొలినాళ్లలోనే వికెట్లు పడిపోయినప్పటికీ, భారత మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఏ ఒక్క బ్యాటర్ కూడా భారీ ఇన్నింగ్స్ లేదా హాఫ్ సెంచరీ చేయలేకపోయినప్పటికీ.. జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతుగా చిన్న చిన్న కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. దీనివల్ల భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. సౌతాఫ్రికా ముందు 159 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఉంచింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ప్రత్యర్థి ముందు 159 పరుగుల గౌరవప్రదమైన లక్ష్యాన్ని ఉంచింది. అయితే 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల జట్టు ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల టీమ్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్ తగిలింది. కేవలం 25 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ దశలో సౌతాఫ్రికా బ్యాటర్లు ఇన్నింగ్స్‌ను ఎంతో అద్భుతంగా చక్కదిద్దారు. ఆ జట్టు బ్యాటర్లు భారత బౌలింగ్ ఎటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, ఎక్కడా లూజ్ షాట్లకు తావివ్వకుండా చాలా సులువుగా లక్ష్యాన్ని ఛేదించారు. దక్షిణాఫ్రికా జట్టులో మారిజాన్ కాప్ 81 పరుగుల విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చింది. 19.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో 3 వికెట్లు పడగొట్టి శ్రీచరణి సౌతాఫ్రికా బ్యాటర్లను కాస్త కట్టడి చేసింది. కానీ అది భారత పరాజయాన్ని ఆపలేకపోయింది. 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల టీమ్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్ తగిలింది. కేవలం 25 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ దశలో సౌతాఫ్రికా బ్యాటర్లు ఇన్నింగ్స్‌ను ఎంతో అద్భుతంగా చక్కదిద్దారుమంచి ఫామ్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ పవర్ ముందు పూర్తిగా తేలిపోయింది. కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంలో భారత బౌలర్లు విఫలం కావడంతో మ్యాచ్ పూర్తిగా చేజారిపోయింది. ఈ ఓటమితో టీమిండియా టోర్నమెంట్‌లో తమ మొదటి పరాజయాన్ని నమోదు చేయగా, రాబోయే మ్యాచ్‌ల్లో సెమీఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ తన తదుపరి పోరులో ఖచ్చితంగా పుంజుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఇంగ్లాండ్‌తో వన్డేలకు భారత జట్టు ప్రకటన..

ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. గాయం నుంచి కోలుకుంటున్న విరాట్ కోహ్లీని ఎంపిక




చేసినప్పటికీ, ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడని బోర్డు స్పష్టం చేసింది. కాగా, అఫ్ఘాన్‌పై సెంచరీ చేసిన జైశ్వాల్‌పై వేటు పడగా.. బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. హార్దిక్ పాండ్యా గాయం కారణంగా దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్న అతడు.. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ వరకు పూర్తిగా కోలుకుంటేనే ఆడతాడని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ లెక్కన ఫిట్‌నెస్ టెస్టులో పాస్ అయితేనే కోహ్లీ ఈ సిరీస్‌లో ఆడతాడు. అఫ్ఘానిస్థాన్‌తో మూడో వన్డేలో శతకం సాధించినప్పటికీ యశస్వి జైశ్వాల్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. చెన్నైలో శనివారం జరిగిన ఈ మ్యాచులో అతడు 86 బంతుల్లో 110 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. కానీ జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో అతడు.. ఈ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోలేకపోయాడు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. తిరిగి జట్టులోకి వచ్చేశాడు. పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా, యువ కెరటం గుర్నూర్ బ్రార్‌కు ఈ జట్టులో చోటు దక్కింది. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను సెలక్టర్లు ఎంపిక చేయలేదు. మహమ్మద్ సిరాజ్‌ను సైతం సెలక్టర్లు పరిగణలోకి తీసుకోలేదు. మొత్తంగా 15 మందిని ఈ జట్టులో ఎంపిక చేశారు.

ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా, గుర్నూర్ బ్రార్.



# మహ్మద్ సిరాజ్ కి దక్కని చోటు..

ఇంగ్లండ్ పర్యటనకు ప్రకటించిన భారత వన్డే జట్టు స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ పేరు లేకపోవడంపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. గత కొన్నేళ్లుగా వైట్ బాల్ క్రికెట్లో భారత జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న ఈ హైదరాబాదీ పేసర్‌ను పక్కన పెట్టడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యంగా ఇంగ్లండ్ లాంటి పిచ్‌లపై మహ్మద్ సిరాజ్‌కు మంచి రికార్డు ఉన్నప్పటికీ.. సెలెక్టర్లు సిరాజ్ స్థానంలో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్‌లకు అవకాశం ఇచ్చారు. మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడానికి గల ప్రధాన కారణాలను బీసీసీఐ అధికారికంగా ప్రకటించనప్పటికీ.. రెండు కీలకాంశాలు ఇందుకు కారణమైనట్లు తెలుస్తోంది.సిరీస్‌ల నుంచి కూడా బీసీసీఐ తప్పించింది. రాబోయే సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్, కీలకమైన టెస్ట్ మ్యాచ్‌లను దృష్టిలో ఉంచుకుని, అతనికి తగినంత విశ్రాంతిని ఇవ్వాలని బీసీసీఐ మెడికల్ టీమ్, టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించాయి. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ గతంలో ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే మహ్మద్ సిరాజ్‌కు వన్డే సిరీస్ నుంచి కూడా పొడిగించిన విశ్రాంతిని ఇచ్చినట్లు తెలుస్తోంది. మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడానికి కేవలం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ మాత్రమే కాకుండా.. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత సిరాజ్ పేలవమైన ఫామ్ కూడా మరో కారణం కావచ్చు. గణాంకాల ప్రకారం.. 2023 వన్డే వరల్డ్ కప్ ప్రారంభం నుంచి సిరాజ్ ఇప్పటివరకు 20 వన్డేలు ఆడి కేవలం 22 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఈ కాలంలో మహ్మద్ సిరాజ్ బౌలింగ్ సగటు 38.36గా నమోదైంది. సిరాజ్ కెరీర్ వన్డే బౌలింగ్ సగటు (25.32) తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కొన్ని మ్యాచుల్లో రాణించినప్పటికీ.. పరుగులను నియంత్రించడంలో, స్థిరంగా వికెట్లు తీయడంలో సిరాజ్ విఫలమయ్యాడు. మరోవైపు యువ పేసర్లు ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ లభించిన అవకాశాలను చక్కగా ఉపయోగించుకుంటూ రాణిస్తున్నారు. దీంతో సిరాజ్‌కు సుదీర్ఘ విశ్రాంతిని ఇచ్చి, రాబోయే టెస్ట్ సిరీస్‌ల కోసం అతడిని తాజాగా ఉంచడంతో పాటు, ఇతర పేస్ ప్రత్యామ్నాయాలను పరిశీలించడానికి సెలెక్టర్లు ఇదే సరైన సమయమని భావించినట్లు స్పష్టమవుతోంది.



# #VenkyAnil5 #NkrAR2 రేపటి నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో మోస్ట్ ఎవైటెడ్ ఎంటర్టైనర్ (#VenkyAnil5 #NkrAR2) రూపొందుతోంది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్ , కళ్యాణ్ రామ్ సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇటివలే ఘనంగా జరిగిన పూజా కార్యక్రమంతో ఈ ప్రాజెక్ట్ లాంఛనంగా ప్రారంభమైంది. తాజాగా, హైదరాబాద్‌లో రేపటి నుంచే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని ఒక ఫన్ వీడియో ద్వారా వెల్లడించారు. సినీ పరిశ్రమలో ప్రమోషన్ల విషయంలో కొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి, మరోసారి తన క్రియేటివిటీని చాటుకున్నారు. ప్రతి అప్డేట్‌ను సరదాగా, ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, ఈసారి కూడా అలాంటి కాన్సెప్ట్‌తోనే ముందుకొచ్చారు. వీడియోలో అనిల్ రావిపూడి తన టీమ్‌తో మాట్లాడుతూ, అభిమానులు తన ప్రమోషన్లను ఎంతగా ఇష్టపడతారో సరదాగా గుర్తుచేసుకున్నారు. అంతేకాదు, ప్రమోషన్లలో తాను మాస్టర్ అని ప్రశంసిస్తూ అభిమానులు తనకు ఖడ్గం, వీరతిలకం బహూకరించారంటూ ఫన్నీగా చెబుతారు. అయితే ఆ తర్వాత కథలో ఊహించని ట్విస్ట్ వస్తుంది. వెంకటేష్ ఆ ఖడ్గంతో అనిల్ రావిపూడి బొటనవేలికి చిన్న గాటు పెట్టి ఆయనకు 'వీర తిలకం' దిద్దుతారు. అనంతరం కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి, సంగీత దర్శకుడు జీ.వి. ప్రకాష్ కుమార్ కూడా అదే విధంగా చేస్తారు. సరదాగా సాగిన ఈ వీడియో చిత్ర బృందం తమ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించిందనే సంకేతాన్ని అందించింది. ఈ వీడియోలో మరో ఆసక్తికర విషయం కూడా వెల్లడైంది. సినిమా కథ రాయలసీమ నేపథ్యంలో సాగుతుందని, అయితే పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులను అలరిస్తుందని మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతి 2027 సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.t

# మాస్ మహారాజా రవితేజ, శివ నిర్వాణ, మైత్రీ మూవీ మేకర్స్ 'ఇరుముడి' నుంచి ఫాదర్స్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

**మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది.**

ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఫాదర్స్ డే సందర్భంగా 'ఇరుముడి' చిత్ర బృందం ఓ బ్యూటీఫుల్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మాస్ మహారాజా రవితేజ, తన కూతురు నుదుటిపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించడం ఆకట్టుకుంటోంది. తండ్రి–కూతుళ్ల మధ్య ఉండే అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను ఎంతో హృద్యంగా ఆవిష్కరించిన ఈ పోస్టర్ ప్రేక్షకులను ఎమోషనల్ గా టచ్ చేసింది. ఈ ఫాదర్స్ డే స్పెషల్ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. కుటుంబ భావోద్వేగాలు నేపథ్యంలో శివ నిర్వాణ ఈ కథను



మనసుని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అదే సమయంలో కమర్షియల్ అంశాలను కూడా సమతూకంగా మేళవించారు. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్ శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. యాక్షన్, భక్తి, కుటుంబ బంధాలు, భావోద్వేగాలను సమన్వయం చేస్తూ రూపొందుతున్న 'ఇరుముడి', రవితేజ కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన చిత్రాల్లో ఒకటిగా నిలవబోతోంది. వరలక్ష్మీ వ్రతం శుభ సందర్భంగా ఇరుముడి ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది



# "ఒక్కడు" 4Kలో చూసేందుకు ఎక్సైటింగ్ గా ఉన్నాను

## రీ రిలీజ్ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్

## ఈ నెల 26న రీ రిలీజ్ కు సిద్ధమైన మహేష్ బాబు "ఒక్కడు"

## ఎక్సైటింగ్ గా ఫీల్ అవుతున్న దర్శకుడు గుణశేఖర్

సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్మెస్ రాజు గారు నిర్మాతగా ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో 2003లో మహేష్ బాబు హీరోగా ప్రేక్షకులకు ముందుకు వచ్చిన చిత్రం ఒక్కడు. సుమారు 23 సంవత్సరాల తర్వాత ఆంధ్ర, తెలంగాణతో పాటు భారతదేశవ్యాప్తంగా 4Kలో తెలుగులో విడుదలవుతుంది. మహేష్ బాబు కమర్షియల్ యాస్పెక్ట్స్ లో కర్నూలు కొండారెడ్డి బురుజు అంటే ఒక్కడు సినిమా అన్నట్లు ఒక మార్క్ సృష్టించి ఇండస్ట్రీ అంతా షేక్ చేసే విధంగా అద్భుతమైన విజయం సాధించిన ఈ చిత్రం రాధా మాధవి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో రామ కృష్ణ గారిచే జూన్ 26వ రీ రిలీజ్ కానుంది. గుణ శేఖర్ కెరియర్ లో అలాగే మహేష్ బాబు కెరియర్ లో ఒక మైల్ స్టోన్ గా నిలిచిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ మరోసారి అలరించేందుకు రానుంది. భూమిక చావ్లా హీరోయిన్గా నటించిన చిత్రంలో ప్రకాష్ రాజ్ విలన్ పాత్రలో నటించారు. ముఖేష్ రిషి, తెలంగాణ శకుంతల, అజయ్, గీత, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, రాజన్, అచ్యుత్ తదితరులు కీలకపాత్రను పోషించారు. ఈ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ... "ఒక్కడు, ప్రతి సంవత్సరం మరింత క్రేజ్ పెంచుకుంటూ ఇప్పటికే ఎన్నోసార్లు రీ రిలీజ్ అయినప్పటికీ మరోసారి రీ రిలీజ్ కు సిద్ధమైంది. ఈ నెల 26వ తేదీన సినిమాను 4Kలో విడుదల కానుంది. అందరిలాగా నేను కూడా ఈ సినిమాను చూసేందుకు చాలా ఎక్సైటింగ్ గా ఉన్నాను. ప్రేక్షకులంతా ఈ సినిమాను మరోసారి 4Kలో చూసి అభినందించాలని కోరుకుంటున్నాను" అన్నారు.



# ప్రేక్షకులను అలరించేలా చిత్రాలు ఉండాల్సిందే

### డబుల్ ఆక్యుపెన్సీ చిత్ర సక్సెస్ మీట్‌లో ఖుష్బూ

మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ'చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.

# ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి




స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.

# అభిమానితో కలసి పుష్ప రీక్రియేట్ చేసిన అల్లు అర్జున్

లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీర్చారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆమెను కలిసిన అల్లు అర్జున్, 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను ఆమెతో కలిసి రీక్రియేట్ చేశారు.




ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ టీమ్ షేర్ చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ హాయ్ శ్రద్ధా, ఎలా ఉన్నావ్? అని పలకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పమని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ బియర్డ్ స్ట్రోక్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ 'డ్యామ్ క్యూట్' అని మెచ్చుకున్నారు. చివరగా నువ్వు కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రా అని చెప్పారు. ఏమవ్వాలనుకుంటున్నావ్ అని అడగగా, శ్రద్ధ డాక్టర్ అవ్వాలని ఉందని బదులిచ్చింది.



# క్రియేటివ్ జీనియస్ సుకుమార్ ను కలిసి బ్లెస్సింగ్స్ తీసుకున్న సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్, హీరో ప్రియదర్శి కాంబో మూవీ టీమ్

ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ కలిసి ప్రియదర్శి హీరోగా ఓ సినిమాను నిర్మించబోతున్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటించనుంది. ఈ మూవీ టీమ్ తాజాగా జీనియస్ డైరెక్టర్ సుకుమార్ ను కలిసి బ్లెస్సింగ్స్ తీసుకున్నారు. ఈ మూవీ టీమ్ కు తన బెస్ట్ విశెస్ అందించారు సుకుమార్. ఈ సందర్భంగా హీరోయిన్ నాగదుర్గ బర్త్ డే సెలబ్రేషన్స్ జరిపారు. కంటెంట్ డ్రివెన్ ఫిలింస్ చేయడంలో ప్రసిద్ధి పొందిన సుకుమార్, బన్నీవాస్ కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాపై మూవీ లవర్స్ లో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. ప్రామిసింగ్ మూవీస్ చేస్తున్న ప్రియదర్శి హీరో కావడం, ఏ ఫోక్ సాంగ్ చేసినా మిలియన్స్ లో వ్యూస్ రాబట్టే క్రేజ్ ఉన్న నాగదుర్గ హీరోయిన్ గా అరంగేట్రం చేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా మారింది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా ఈ సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందించనున్నారు. ఈ నెల 25న ప్రారంభం కానున్న ఈ మూవీ వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఈ క్రేజీ కాంబో మూవీ గురించి మరిన్ని డీటెయిల్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

# కాక్‌టెయిల్2 కుటుంబ కథా చిత్రం

షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ




ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ.13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380